




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 315 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 20 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# 2026లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం

- నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి
- కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అని వ్యాఖ్య
- త్వరలో 150 లోకోమోటివ్‌లు ఎగుమతి అవుతాయని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 2026లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని ఆయన పేర్కొన్నారు. పనులు వేగంగా సాగుతున్నట్లు ఆయన తెలిపారు. 2026లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. కాజీపేట నుంచి త్వరలో 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయని ఆయన అన్నారు. భవిష్యత్తులో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయారవుతాయని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ 40 ఏళ్ల పోరాటమని గుర్తు చేశారు. రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంజూరు చేశారని అన్నారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని వెల్లడించారు.

వరంగల్‌కు ఇప్పటికే విమానాశ్రయం రావాల్సి ఉందని, ఎయిర్ పోర్టుకు భూములు ఇవ్వాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు అడిగామని గుర్తు చేశారు. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని కిషన్ రెడ్డి అన్నారు.



## కులగణన కేవలం డేటా సేకరణ మాత్రమే కాదు.. మెగా హెల్త్ చెకప్

- కులగణనపై 300 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన రిటైర్డ్ జడ్జి సుదర్శన్ రెడ్డి కమిటీ
- బీసీల అభ్యున్నతికి, సామాజిక న్యాయం అమలుకు కులగణన ఉపయోగపడుతుందన్న సీఎం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో నిర్వహించనున్న కులగణన కేవలం డేటా సేకరణ మాత్రమే కాదని, ఇది తెలంగాణ రాష్ట్ర మెగా హెల్త్ చెకప్ కు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీల అభ్యున్నతికి, సామాజిక న్యాయం అమలుకు కులగణన ఎంతగానో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. కులగణనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రితో సమావేశమైంది.కమిటీ 300 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కమిటీ చేసిన సూచనలపై మంత్రివర్గంలో చర్చించి ప్రభుత్వం

వివరాలు 2లో..

## తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ గా ఏకే సింగ్ ప్రమాణస్వీకారం



- తెలంగాణ ఏడో చీఫ్ జస్టిస్ గా ఏకే సింగ్
- ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన సీఎం రేవంత్, పలువురు మంత్రులు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జ స్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ప్రమాణస్వీకారం చేశారు.

వివరాలు 2లో..

## మరో నయీంలా మైనంపల్లి వ్యవహరిస్తున్నారు



- బీఆర్ఎస్ కార్యకర్తలను మైనంపల్లి భయాందోళనలకు గురి చేస్తున్నారన్న శ్రవణ్
- కేటీఆర్ పై, బీఆర్ఎస్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న శ్రవణ్

హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హను మంతరావుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర వి మర్శలు గుప్పించారు. మరో న యీం మాదిరి మైనంపల్లి వ్యవహరిస్తూ... బీఆర్ఎస్

వివరాలు 2లో..

## హైడ్రా విజయాలతో పాటు సవాళ్లను కూడా ఎదుర్కొంది

- ఏడాది కాలంలో హైడ్రాపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించామన్న రంగనాథ్
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ప్రజలకు అవగాహన వచ్చిందని వెల్లడి
- ఏడాది కాలంలో 500 ఎకరాలు కాపాడినట్లు వెల్లడి



వివరాలు 2లో..

## బండి X ఈటల.. హుజూరాబాద్ బీజేపీలో లొల్లి..

### పార్టీలో గ్రూపుల్లేవంటున్న బండి.. తమకు ప్రయార్టీ లేదన్న ఈటల వర్గం

- ఎంపీ ఎలక్షన్లలో పార్టీకి హుజూరాబాద్ లో తక్కువ ఓట్లు రావాలని
- కొందరు నాయకులు పనిచేశారని ఆరోపణ
- ఎక్కడా లేని సమస్య ఇక్కడే ఎందుకు వస్తుందని కామెంట్
- శామీర్ పేట నివాసానికి వచ్చి ఆందోళన




హైదరాబాద్ పెన్ పవర్: బీజేపీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల వర్గాల మధ్య రచ్చ ఇవాళ (జులై 19) మరోమారు బహిర్గతమైంది. తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని పేర్కొంటూ హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన కొందరు శామీర్ పేటలోని ఈటల రాజేందర్ నివాసానికి చేరుకున్నారు. రెండు రోజుల క్రితం హుజూరాబాద్ లో బండి సంజయ్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తమకు కనీస సమాచారం ఇవ్వలేదని వారు ఆరోపి స్తున్నారు.

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి పదవిని కొనుక్కున్నారని చెప్పింది కోమటిరెడ్డి సోదరులే

- వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్న జగదీశ్ రెడ్డి
- వాళ్లవి అన్నీ బ్లాక్‌మెయిల్ స్టేట్‌మెంట్లేనని విమర్శ
- రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయనని రాజగోపాల్ రెడ్డి గతంలో చెప్పారన్న మాజీ మంత్రి




హైదరాబాద్ పెన్ పవర్: రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుక్కున్నారని స్వయంగా కోమటిరెడ్డి సోదరులే ఆరోపించారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. వారి వ్యాఖ్యలన్నీ బ్లాక్‌మెయిల్ స్టేట్‌మెంట్లేనని ఆయన అభివర్ణించారు.వారు ఒక ప్రకటన చేసి వెంటనే

వివరాలు 2లో..

## టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పించినా పాక్ లో ఇక మరణశిక్ష ఉండదు!

- క్రిమినల్ లాస్ బిల్లు సవరణలకు పాక్ పార్లమెంటు ఆమోదం
- టెర్రరిస్టులకు, హైజాకర్లకు ఆశ్రయం ఇస్తే గతంలో మరణశిక్ష
- తాజా బిల్లుతో మరణశిక్ష జీవితఖైదుగా మార్పు



వివరాలు 2లో..

## 300 డ్రోన్లు, 30 క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

- దాడిలో అనేక నివాస భవనాలు, ఆసుపత్రులు ధ్వంసమైనట్లు తెలిపిన ఉక్రెయిన్
- భవనాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నట్లు వెల్లడి
- దాడుల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపిన ఉక్రెయిన్



వివరాలు 2లో..

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు

### ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్



- మణిపూర్ లో కొంతకాలంగా హింస
- గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరత
- సొంత దేశంలో సమస్యలు పరిష్కరించాలని మోదీకి ఖర్గే హితవు

హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 42 దేశాలను సందర్శించిన ప్రధాని మోదీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని మాత్రం ఇప్పటివరకు సందర్శించలేకపోయారని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో గత కొంతకాలంగా హింసాత్మక సంఘటనలు, గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రధానమంత్రిగా మోదీ సొంత దేశంలోని

వివరాలు 2లో..

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



- అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతూ ముందుకు వెళుతున్నామన్న అమిత్ షా
- మోదీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ నాలుగో స్థానానికి వచ్చిందన్న అమిత్ షా
- 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతామన్న అమిత్ షా

హైదరాబాద్ పెన్ పవర్:2027 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ శరవేగంగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ, 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు.గడిచిన పదేళ్లలో దేశాభివృద్ధి 60 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించినట్లు అమిత్ షా వెల్లడించారు. వాజ్‌పేయి హయాంలో భారతదేశం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, మోదీ పాలనలో నాలుగో స్థానానికి చేరుకుందని, త్వరలోనే మూడో స్థానానికి ఎదుగుతుందని ఆయన ఆశాభావం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కళ్యాణమస్తు.. అస్తు.. మస్తు.. ఇక అంతేనా?

తెలంగాణలో కళ్యాణలక్ష్మి పథకానికి ప్రభుత్వం అంపకాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఇంత వరకూ కళ్యాణ లక్ష్మి మాత్రం అమలు కాలేదు. షాదీ ముబారక్ ను కూడా గ్రౌండ్ చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారంతో పాటు లక్ష రూపాయల నగదును ఇస్తామని ప్రకటించింది. ఇది తమ గ్యారంటీ అని చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన హామీలు అమలు చేస్తున్నా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. దీనికి కారణం నిధుల కొరత అని చెప్పుకోవాల్సి ఉంటుంది.

**పేరును మారుస్తూ...**

అయితే కొన్ని రోజుల క్రితం మాత్రం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళ్యాణ లక్ష్మి పథకం పేరును కళ్యాణమస్తుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు మార్పుపై స్పష్టత నిచ్చారు. కళ్యాణ మస్తు పథకాన్ని త్వరలోనే అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది క్రితం చెప్పారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లను తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందని మంత్రి పొన్నం తెలిపారు. లక్ష రూపాయల నగదు ఇస్తామని చెప్పారు. తులం బంగారం గురించి కూడా నాడు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించలేదు. కనీసం బడుగు, బలహీన , పేద వర్గాలకు కళ్యాణమస్తు పథకం అమలు చేస్తారని అందరూ భావించారు.

**పెళ్లిళ్ల సీజన్ వెళ్లిపోతున్నా...**

వరసగా పెళ్లిళ్లు సీజన్లు పూర్తవుతున్నాయి. కానీ కళ్యాణమస్తు పథకం మాత్రం ఇంత వరకూ అమలుకు నోచుకోలేదు. కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ జనాల్లోకి అందులోనూ మహిళల్లోకి బాగా ప్రాచుర్యం పొందింది. మహిళలకు బంగారం అంటే అత్యంత ఇష్టం కావడంతో వారి బలహీనతను చూసి హామీని ఇచ్చారని అప్పట్లో బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పై విమర్శలు చేసింది. అయితేనేం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిరెండేళ్లు గడుస్తున్నా ఇంత వరకూ కళ్యాణమస్తు, షాదీముబారక్ పథకాలను మాత్రం కాంగ్రెస్ సర్కార్ అమలుకు పూనుకోలేదు.

**బంగారం ధర పెరగడంతో...**

మొన్నటి వరకూ పెళ్లిళ్లు జరిగాయి. మళ్లీ పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుంది. జులై చివరి నుంచి నవంబరు నెల వరకూ మంచి ముహూర్తాలున్నాయి. దీంతో అనేక మంది ముహూర్తాలు పెట్టుకుని పెళ్లిళ్లకు సిద్ధమయ్యారు. ఎన్ని జంటలు ఒక్కటవుతున్నా ఇచ్చిన ప్రామిస్ మాత్రం అమలు కావడం లేదు. తులం బంగారం ఇవ్వాలంటే ఇప్పుడు సాధ్యమయ్యే పనికాదు. ఎందుకంటే పది గ్రాముల బంగారం ధర దాదాపు లక్ష రూపాయలకు చేరువలో ఉంది. అందుకే ప్రభుత్వం వెనకగడుగు వేస్తుందని అంటున్నారు. తులం బంగారం మాట దేముడెరుగు... కనీసం లక్ష రూపాయలైనా ఇచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్న డిమాండ్ వినపడుతుంది. మరి రేవంత్ సర్కార్ ఈ పథకానికి ముహూర్తం మాత్రం నిర్ణయించలేదు..

# హైడ్రా విజయాలతో పాటు సవాళ్లను కూడా ఎదుర్కొంది

ఈ సంవత్సరం విజయాలతో పాటు పలు సవాళ్లను కూడా ఎదుర్కొన్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో హైడ్రాపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించామని ఆయన వెల్లడించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ఏమిటో ప్రజలకు హైడ్రా ద్వారా అవగాహన వచ్చిందని తెలిపారు. అదే సమయంలో చెరువులు, నాలాల వద్ద ఆక్రమణలు కూడా తగ్గినట్లు వెల్లడించారు. ఏడాది కాలంలో దాదాపు 500 ఎకరాల వరకు కాపాడామని అన్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.30 వేల కోట్లు ఉంటుందని రంగనాథ్ వెల్లడించారు. హైడ్రా కారణంగా కబ్జాలు తగ్గాయని అన్నారు. దాదాపు 20 చెరువుల్లో ఆక్రమణలను తొలగించినట్లు ఆయన వెల్లడించారు. నిన్న భారీ వర్షం కురిసినప్పటికీ ఈ నీరు బతుకమ్మకుంట చెరువులో చేరడం ద్వారా వరదను తగ్గించినట్లు చెప్పారు. దాని వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అన్నారు. మరికొన్ని చెరువుల్లో కూడా ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. హైడ్రా వచ్చిన తర్వాత నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని వెల్లడించారు. ఆక్రమణల విషయంలో హైడ్రా చాలా సీరియస్‌గా ఉందని అన్నారు. మూసీతో హైడ్రాకు సంబంధం లేకపోయినప్పటికీ తమకు ఆపాదించారని అన్నారు. హైడ్రా పెద్దల జోలికి వెళ్లదు, పేదలను లక్ష్యంగా చేసుకుంటుందని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## బండి X ఈటల.. హుజూరాబాద్ బీజేపీలో లొల్లి..

- మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో తమ భవిష్యత్ ఏమిటని వారు ఈటలను ప్రశ్నిస్తున్నారు. 25 ఏళ్లుగా ఈటల వెంట ఉన్నామని సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో తమకు సీట్లు కేటాయించాలంటున్నారు. సైకిళ్ల పంపిణీకి వచ్చిన బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో వర్గాలు ఉండవన్నారు. వ్యక్తుల కోసం పనిచేస్తే టికెట్లు రావని కుండబద్దలు కొట్టారు. ఎక్కడా లేని పంచాయితీ హుజురాబాద్ లోనే ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. పార్టీ జెండా కోసం పనిచేసినోళ్లకు భవిష్యత్తు ఉంటుందని చెప్పుకొచ్చారు.

పరోక్షంగా ఈటలను ఉద్దేశిస్తూ.. ఒకాయన పార్టీలో చేరినప్పుడు తాను అంత యాక్టీవ్ గా లేనని చెప్పుకొచ్చారు. ఎవరి రాజకీయ భవిష్యత్ వారిదేనని కూడా అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో పార్టీకి హుజూరాబాద్ లో తక్కువ ఓట్లు రావాలని పనిచేశారని, ఆ డీటెయిల్స్ తన వద్ద ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. వాళ్లకు టికెట్లు ఇవ్వమంటారా? అని ప్రశ్నించారు. ఎవరు ఏ వర్గమో నాకేం తెలుస్తుందనీ అన్నారు.

**కాళేశ్వరం విచారణ తర్వాత మారిన సీన్**

మల్కాజ్ గిరి ఎంపీ, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఇటీవల కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కేబినెట్ ఆమోదంతోనే జరిగిందని, సింగిల్ గా ఆయన నిర్ణయం తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత ఓ టీవీ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమని అన్నారు. కాళేశ్వరం కారణంగానే తెలంగాణకు జలకళ వచ్చిందనీ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ 'కాళేశ్వరంపై మోదీ చెప్పిందే బీజేపీ విధానం.

కాళేశ్వరంపై బీజేపీ స్టాండ్ మారిందని, బీఆర్ఎస్‌తో కుమ్మక్కైందని కొంతమంది విష ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో బీజేపీ స్టాండ్ వెరీ క్లియర్. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులే వందల కోట్లు సంపాదించారంటే, ఇక కేసీఆర్ కుటుంబం ఏ స్థాయిలో అవినీతికి పాల్పడిందో అర్థం చేసుకోవచ్చు. "మేం మాట మార్చడానికి ఊసరవెల్లులం కాదు. నేను గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, ఇప్పుడు కేంద్ర మంత్రిని. కాబట్టి అప్పుడో మాట, ఇప్పుడో మాట చెప్పొచ్చా? ' అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు, కాగజ్ నగర్ ఎమ్మెల్యే హరీశ్... వీళ్లంతా కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద స్కామ్ అని, సీబీఐ విచారణ జరగాలని, బండి సంజయ్ చెప్పిందే పార్టీ విధానమని ప్రకటనలు చేశారు. ఈ క్రమంలో ఈటల ఒంటరిగా మిగిలిపోయారు.

**పార్టీ అధ్యక్ష పదవి రాలే**

కాళేశ్వరంపై ఈటల చేసిన వ్యాఖ్యలు ఆయన మెడకే చుట్టుకున్నాయి. ఈ క్రమంలో ముందటి దాకా వచ్చిన అధ్యక్ష పదవి కాస్తా దూరమైందనే టాక్ పార్టీలో ఉంది. అదే నియోజకవర్గానికి చెందిన నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ ను బీజేపీ అధినాయకత్వం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది.

**బండి ఏమన్నారంటే..**

' బీజేపీలో వర్గమనే ఉండదు.. అందరూ పార్టీ కోసమే పనిచేయాలి. ఒకాయన చేరినప్పుడు నేను అంత యాక్టీవ్ గా లేను.. పార్టీలో ఎక్కడా లేని పంచాయతీలు హుజూరాబాద్ లోనే ఎందుకు వస్తుంది. ఎంపీ ఎలక్షన్ల పార్టీకి హుజూరాబాద్ లో తక్కువ ఓట్లు రావాలని కొందరు పనిచేసిండ్రు.. వాళ్లకు టికెట్లు ఇవ్వుమంటవా..? ఎవరు ఏ వర్గమో నాకేం తెలుస్తది. వ్యక్తి కోసం పనిచేస్తే టికెట్లు ఇవ్వం.

## తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ గా ఏకే సింగ్ ప్రమాణస్వీకారం

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. రాజ్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఇప్పటి వరకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ లుగా ఆరుగురు పనిచేశారు. జస్టిస్ ఏకే సింగ్ ఏడో చీఫ్ జస్టిస్.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టేందుకు మోదీ సంకల్పించారని ఆయన పునరుద్ఘాటించారు.ప్రస్తుతం ఆర్థిక ర్యాంకింగ్స్‌లో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే భారత్ కంటే ముందున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని అధిగమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దీని కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వాణిజ్య నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ కంపెనీలను ఆహ్వానించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

## ఆ డబ్బుతో ఐదు పోలవరం ప్రాజెక్టులు కట్టొచ్చు

ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నేడు సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా చోడ వరం నియోజకవర్గంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా, పెంచిన పెన్షన్లను ఇంటివద్దకే అందిస్తున్నామని అన్నారు. ఏపీలో ఐదేళ్లలో ఇచ్చే పెన్షన్ సొమ్ముతో ఐదు పోలవరం ప్రాజెక్టులు నిర్మించవచ్చని, ఇచ్చిన హామీ మేరకు ఎక్కడా రాజీపడకుండా పెన్షన్ అందిస్తున్నామని మంత్రి నిమ్మల వివరించారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయని విమర్శించారు. "మూడు రాజధానులు అన్నారు... ఒక్క రాజధాని కూడా కట్టలేదు. రాష్ట్రానికి వచ్చిన కంపెనీలను తరిమేశారు. మద్యం, ఇసుక, మైనింగ్, భూములు... ఇలా అన్నీ కొల్లగొట్టారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ తప్పులన్నీ సరిదిద్దుతూ వస్తోంది" అని నిమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మలతో పాటు ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి పదవిని కొనుక్కున్నారని చెప్పింది కోమటిరెడ్డి సోదరులే

- మొదటి పేజీ తరువాయి

రాజీ పడతారని ఆయన వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పదవిని కొనుక్కున్నారని చెప్పడమే కాకుండా, ఆయన నాయకత్వంలో పనిచేయబోమని రాజగోపాల్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి వద్దని చెప్పి పార్టీ వీడిన రాజగోపాల్ రెడ్డి తిరిగి అదే పార్టీలో కొనసాగుతున్నారని ఆయన అన్నారు. రాజగోపాల్ రెడ్డి మాటలను నమ్మేవారు అమాయకులే అవుతారని ఆయన పేర్కొన్నారు.

## కులగణన కేవలం డేటా సేకరణ మాత్రమే కాదు.. మెగా హెల్త్ చెకప్

- మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకోనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వెనుకబాటుతనంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలు, వాటికి గల కారణాలను అధ్యయనం చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిర్వహించిన ఈ సర్వే చారిత్రాత్మకమైనదని ఆయన అన్నారు. ఇది దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.

## మరో నయీంలా మైనంపల్లి వ్యవహరిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

కార్యకర్తలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లో రౌడీయిజానికి అడ్డూ అదుపూ లేదని చెప్పడానికి మల్కాజ్ గిరి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని శ్రవణ్ మండిపడ్డారు. ఇది రౌడీ పాలనా? లేక ప్రజాపాలనా? అనేది సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మైనంపల్లిలో మార్పు వస్తుందేమోనని ఇన్నాళ్లు ఎదురు చూశామని... కానీ ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. ఈరోజు గాంధీభవన్ లో మాట్లాడుతూ కేటీఆర్, బీఆర్ఎస్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. చీమలపుట్టలోకి పాములు చొరబడనట్టు మల్కాజిగిరిలోకి మైనంపల్లి చొరబడి రౌడీయిజం చేస్తున్నాడని మండిపడ్డారు.

మైనంపల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినప్పుడు ఆయన కాళ్లు మొక్కిన మైనంపల్లి.... ఈరోజు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ విశ్వాసం లేకుండా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.

## 300 డ్రోన్లు, 30 క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. కీవ్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో రష్యా దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆసుపత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని, వారిని బయటకు తీసుకురావడానికి భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ దాడుల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని, ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా కూడా ఆయుధ సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా కీవ్‌కు ఎం1ఏ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపించనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు. కీవ్‌పై మాస్కో అనైతిక, చట్టవిరుద్ధమైన దండయాత్రకు వ్యతిరేకంగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ఆస్ట్రేలియా తెలిపింది.

## టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పించినా పాక్ లో ఇక మరణశిక్ష ఉండదు!

పాకిస్థాన్ పార్లమెంటులో క్రిమినల్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు-2025 ఆమోదం పొందింది. ఈ బిల్లు... టెర్రరిస్టులకు, హైజాకర్లకు ఆశ్రయం ఇవ్వడం, మహిళలకు బహిరంగంగా బట్టలు ఊడదీయడం వంటి నేరాలకు మరణశిక్షను రద్దు చేసి, బదులుగా జీవిత ఖైదును విధించేలా చేస్తుంది. ఈ బిల్లును పాక్ హోం శాఖ సహాయ మంత్రి తలాల్ చౌదరి చట్టసభలో ప్రవేశపెట్టారు.ఈ బిల్లు పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 354-ఎ, 402-సి లలో సవరణలు చేస్తుంది. సెక్షన్ 354-ఎ ప్రకారం, ఎవరైనా మహిళపై దాడి చేసి, ఆమె బట్టలు ఊడదీసి, బహిరంగంగా అవమానిస్తే, మరణశిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానాతో శిక్షించబడతారు. కానీ, కొత్త బిల్లు ఈ నేరాలకు మరణశిక్షను తొలగించి, జీవిత ఖైదును తప్పనిసరి శిక్షగా విధిస్తుంది. ఈ బిల్లు యూరోపియన్ యూనియన్‌తో జీఎస్‌పీ ప్లస్ వాణిజ్య ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చేందుకు తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.

కాగా, ఈ సవరణలకు పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్లమెంటరీ నాయకుడు సయ్యద్ అలీ జఫర్, బలూచిస్థాన్ అవామీ పార్టీ సెనెటర్ సమీనా ముంతాజ్ జెహ్రీ తదితరులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. మహిళలపై ఇటువంటి దాడులు హత్యకు సమానమైన నేరాలని, వీటికి మరణశిక్షను కొనసాగించాలని వారు వాదించారు. 1982లో జనరల్ జియా ఉల్ హక్ హయాంలో మహిళను బట్టలు ఊడదీయడం వంటి నేరానికి ఏడేళ్ల జైలు శిక్ష నుంచి మరణశిక్షగా మార్చినట్లు సెనెటర్ జఫర్ గుర్తు చేశారు. అయితే, ఈ చట్టాన్ని కొందరు కుటుంబ, ఆస్తి వివాదాల్లో దుర్వినియోగం చేస్తున్నారని, పోలీసులకు లంచాలు ఇచ్చి తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మంత్రి తలాల్ వెల్లడించారు.

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు

- మొదటి పేజీ తరువాయి

సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యటనలపై దృష్టి సారించడం సరికాదని ఖర్గే వ్యాఖ్యానించారు.

మణిపూర్ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, స్థానిక నాయకులతో చర్చించాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో శాంతి, స్థిరత్వం తీసుకురావడానికి తక్షణ చర్యలు అవసరమని ఖర్గే పేర్కొన్నారు. అంతేకాకుండా, రాజ్యాంగాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా దేశ ప్రజల హక్కులను హరించే చర్యగా పరిగణించబడుతుందని ఖర్గే హెచ్చరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, దానిని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ఆదివాసీ బిడ్డల స్పెషల్ డీఎస్సీ సాధనకై మహాపోరాటం




● 48 గంటల ధర్నా గిరిజన నిరుద్యోగులు

**చింతపల్లి పెన్ పవర్ జూలై 19:-**ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో ఐటీడీఏ కార్యాలయం ముందు 48 గంటల పాటు మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. శనివారం ఈ మహాధర్నాకు సంబంధించిన ప్రకటనను ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ ఎస్. ధర్మానపడాల్, కో కన్వీనర్లు కూడ రాధాకృష్ణ, వంతల నాగేశ్వరరావు, భాను సిహెచ్ రావు, ఎన్. ప్రవీణ్, డిపి శంకర్, ఎం. విష్ణుమూర్తి, రాజం నాయుడు, పేసా కమిటీ మండల నాయకులు జి. వాసుదేవ్ తదితరులు పాడేరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహా ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ఆదివాసీ యువత, నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నాకు ప్రధాన కారణం ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నుండి ఆదివాసీ ప్రాంత పోస్టులను మినహాయించి, ప్రత్యేక డీఎస్సీ ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నదే ప్రధాన డిమాండ్ గా పేర్కొన్నారు. దీంతో పాటు, ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో 100 శాతం, ఉద్యోగ నియామకాల చట్టాన్ని అమలు చేయాలని ఆదివాసీ సంఘాలు పట్టుబడుతున్నాయి. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఏప్రిల్ నెల నుండి దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం స్పందించి 100 శాతం రిజర్వేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి మే 12న ప్రకటించినప్పటికీ, ముఖ్యమంత్రి తన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని సంఘ నాయకులు విమర్శిస్తున్నారు మెగా డీఎస్సీ నుండి ఆదివాసీ ప్రాంత పోస్టులు మినహాయించి, ప్రత్యేక డీఎస్సీ ద్వారానే వాటిని భర్తీ చేయాలన్న ఉద్యమానికి ప్రభుత్వం ఇప్పటికీ స్పందించక పోవడంతో ఈమహాధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ ధర్నాలో ఆదివాసీ నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు అందరూ పాల్గొని తమ హక్కుల సాధనకు మద్దతు తెలపాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు.

## సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ కి వినతి



**గాజువాక: పెన్ పవర్, జూలై 19**

బి హెచ్ పి వి మైదానం వాకర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు 69 వ వార్డ్ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను కార్పొరేటర్ కి వివరించారు. తమ అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అనార్ బాబు , సెక్రటరీ భాస్కర్ , ఆర్గనైజర్ ప్రసాద్ , రాము, దుర్గా, రాంబాబు , శశి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్

## కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు. ప్రజా ప్రతినిధులు.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 19:-.** చింతపల్లిలో ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్వర్ణాంధ్ర స్వేచ్ఛ భారత్ కార్యక్రమంఘనంగాపురస్కరించుకున్నరు. ప్రతి కిరాణా దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ పై అవగాహన తెలియజేస్తూ ప్లాస్టిక్ అమ్మకూడదని పంచాయితీ అధికారులు కూటమి నాయకులు నోటీసులుజారీ చేశారు. అనంతరం చింతపల్లి ఎంపీడీవో కార్యాలయం ప్రాగాణంలో ఆకృతి పరిరక్షణ కాపాడే దశగా మరికొన్ని మొక్కలు ఉడిసి. వాతావరణాన్ని కాపాడే దిశగా కార్యక్రమాన్ని చేపట్టారు. పాల్గొన్న వారు. చింతపల్లి మండల ప్రభుత్వ ఉన్నత అధికారులు. మరియు మండల ఎంపీపీ అనూష దేవి. మండల జెడ్పిటిసి పోతురాజు బాలయ్య. పంచాయతీ సర్పంచ్ దరియా పుష్పలత. కూటమి ప్రభుత్వ నాయకులు మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు గ్రామ సచివాలయం సిబ్బంది ఎనర్జీ ఎస్ వీఆర్పీలు .పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలలో అసమానత్వాన్ని తొలగించటమే పి4 యొక్క ప్రధాన లక్ష్యం

● సర్పంచ్ కుందేరి రామకృష్ణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని దామనాపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆనంతరం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ రుత్తుల వెంకట శివలక్ష్మి ఆధ్వర్యంలో పి4 గ్రామసభ నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆశయాల మేరకు పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్య ఉద్దేశమన్నారు. పేదలను గుర్తించి వారికి ఆర్థికంగా, విద్యా, వైద్య రంగాల్లో సమగ్ర సహాయం అందించాలన్నారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా పేద కుటుంబాల విద్యార్థులను దత్తత తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్లు పేదరిక నిర్మూలనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేసా కమిటీ కార్యదర్శి మాదిరి చంటిబాబు మాట్లాడుతూ, పేదలకు సహాయం చేయటానికి మార్గదర్శకులను గుర్తించి, సంఘీభావంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమరాజు, ఉప సర్పంచ్ చిలకమ్మా, వార్డ్ సభ్యులు కృష్ణ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పేసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మొట్టడం శరబన్న దొర నియామకం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడ గ్రామానికి చెందిన మొట్టడం శరబన్న దొరను చింతపల్లి మార్కెట్ యార్డ్ బోర్డు డైరెక్టర్గా తెలుగుదేశం పార్టీ నియమించింది. ఈ సందర్భంగా శరబన్న దొర మీడియాతో మాట్లాడుతూ, తనను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిన టిడిపి అధిష్టానానికి, నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వర్‌కు, మరియు మద్దతు తెలిపిన ఇతర కూటమి నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన ఈ పదవిని అంతఃకరణ శుద్ధితో, ప్రజాసేవ లక్ష్యంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.

## బదిలీపై వెళ్తున్న సచివాలయం సిబ్బందికి ఘన సన్మానం




● భావోద్వేగానికి గురైన ప్రజలు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ కేంద్రంలో బదిలీపై వెళ్తున్న సచివాలయం ఉద్యోగులకు శనివారం స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, డిజిటల్ అసిస్టెంట్ శేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ పాత్రుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యుగంధర్, వెటర్నరీ అసిస్టెంట్ బాలయ్య, మహిళా పోలీస్ భారతి, ఏఎన్ఎం శాంతి వంటి ఉద్యోగుల సేవలు అనిర్వచనీయమైనవని కొనియాడారు. పంచాయతీ అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీరి పాత్ర మరువలేనిదని తెలిపారు. పేసా కమిటీ కార్యదర్శి మాదిరి చంటిబాబు మాట్లాడుతూ, బదిలీ అనేది ఉద్యోగ జీవితంలో భాగమే అయినప్పటికీ ప్రజలకు వీరు అందించిన సేవలను స్మరించుకుంటామని, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. సర్పంచ్ రామకృష్ణ సచివాలయం సిబ్బందిని దుస్సాలువులతో సత్కరించి, మెమెంటోలు బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఉద్యోగుల సేవలను ప్రశంసిస్తూ మాట్లాడారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు కూడా తన అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రుత్తుల వెంకట శివలక్ష్మి, ఎంపీటీసీ కొర్ర భీమారావు, ఉప సర్పంచ్ చిలకమ్మా, వార్డు సభ్యులు కృష్ణారావు, మోహన్ రావు, గ్రామ పెద్దలు నాగరాజు, చిట్టిబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ జోసెఫ్, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, వీఆర్పీ సత్తిబాబు, పంచాయతీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావర ణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత





● పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు బాధ్యత

● భీమిలి ఎమ్మెల్యే గంటా

**భీమిలి,పెన్ పవర్,జూలై 19 :**భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో.. ఆనందపురం మండలం బి.పి. కల్లాలలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్రలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావర ణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్ తరాలలో మార్పు వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై తాటి తూరు హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు గంటా బహుమతి ప్రదానం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై బాధ్యత తీసుకుని పర్యావరణాన్ని రక్షిస్తామని.. పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని.. ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తాటితూరు కాజ్ వే పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, డి.ఎల్.పి.ఓ. సిహెచ్. నిర్మలాదేవి, ఎం.పి.డి.ఓ. కె.వి.నరసింహారావు, డిప్యూటీ ఎం.పి.డి.ఓ. కె.రమేష్ నాయుడు, ఎమ్మార్వో బి.రామారావు తదితరులు పాల్గొన్నారు. సుపరిపాలన ప్రచారం లో గంటా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో భాగంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం తాటితూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకు న్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకా లను.. చేపడుతున్న అభివృద్ధి పనులను కరపత్రాలు అందజేసి వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సరగడ అప్పారావు, వై.అనిల్ ప్రసాద్, గొలగాని నరేంద్ర, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కోరాడ రమణ, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యం గా ప్రభుత్వం పనితీరు : మేయర్,ఎమ్మెల్యే



**గాజువాక :పెన్ పవర్ ,జూలై 19 :**గ్రేటర్ విశాఖ నగరంలో గాజువాక ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు,నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 67 వ వార్డు గణేష్ నగర్,బొజ్జన్నకొండ,కృష్ణానగర్,సాయిరాం నగర్,జోగవానిపాలెంలో 3.50 కోట్లతో చేపట్టనున్న ప్రధాన కాలువలు,పైపు లైన్స్,రోడ్లు,కాలువల నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్,ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ వార్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ నగరంలోని అన్ని వార్డులు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా ప్రజల దాహార్తిని తీర్చే ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి,సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ పల్లా అచ్చిబాబు,వార్డు తెదేపా,జనసేన అధ్యక్షులు పల్లా కు%శీ%చబాబు,గొలగానిగోపి, కె.సింహాచలం,వాసు,సన్నీ,కమల్,పోలవరపు అప్పారావు,ఖలీమ్,అమ్మాజీ,రామలక్ష్మి,ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## విజయవంతంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ.




**హుకుంపేట పెన్ పవర్ జూలై 19.**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని వివరిస్తూ. పంచాయతీరాజ్ అధికారులు మరియు స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం కోసం దుకానుదారులకు అవగాహన కల్పించడం కల్పించారు. అలాగే ప్లాస్టిక్ వాడితే జరిమాన విధించబడుతుందని పంచాయతీ అధికారులు వ్యాపారులను. హెచ్చరించారు. ప్లాస్టిక్ వల్ల కాలుష్యం పెరుగుతుంది. కాబట్టి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని అన్నారు ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ గా వచ్చిన డిపిఓ చేతుల మీదుగా క్లాప్ మిత్రాలకు సన్మానించడం చేసారు. క్లాప్ మిత్రాల వల్ల మన పంచాయతీలు కు ఎలాంటి ఉపయోగం ఉంటుందని, క్లాప్ మిత్రాల వలన మన గ్రామాలు ఎంత శుభ్రంగా ఉంటుందో డిపిఓ తెలియజేసారు ఈ కార్యక్రమంలో డిపిఓ కె పి చంద్ర శేఖర్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీపీ రాజబాబు, స్థానిక సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీ రమా, ఈవోపీఆర్డి పరమేష్, సెక్రెటరీ సత్యనారాయణ, ఎంఈఓ చెల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ సంజీవరావు,ఐ సి డి సి. సి డి పి ఓ. సువర్ణ, హుకుంపేట పాఠశాల సిబ్బంది వైద్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది,వార్డ్ మెంబెర్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు?

## జి.ఓ. నెం.3పై ఈనెల 22న వర్క్‌షాప్

● పాడేరు ఐటిడిఏ ఇన్చార్జి పిఓ జెసి డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 19:** జి.ఓ. నెం.3 మరియు గిరిజన చట్టాలపై ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ఇంచార్జ్ పి.ఓ జె.సి డాక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి అధ్యక్షతన పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో జరగనుంది. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘాలు, మహిళా సంఘాలు, జాయింట్ యాక్షన్ కమిటీలు, సాధన కమిటీలు, గిరిజన విలేఖరుల సంఘాలు, లాయర్ల యూనియన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, గిరిజన పెద్దలు తదితరులు పాల్గొనాలని పి.ఓ కోరారు. జి.ఓ. నెం.3 మరియు ఏజెన్సీ చట్టాలపై తమ అభిప్రాయాలను ఈ వేదికలో వెల్లడించాలని ఆయన సూచించారు.

## పరిశుభ్రత అనేది బాధ్యతగా కాకుండా

# మన సంస్కృతిలో భాగంగా మారాలని

### కలెక్టరేట్లో స్వచ్ఛ ఆంధ్ర దివాస్ నిర్వహించిన అధికారులు.





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అనకాపల్లి, జులై 19 :**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి కలెక్టరేట్ లో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర దినంగా పాటిస్తూ కలెక్టరేట్ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిస రాలను శుభ్రపరిచారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి టి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

అనంతరం పరిపాలన అధికారి సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర %- % స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది బాధ్యతగా కాకుండా మన సంస్కృతిలో భాగంగా మారాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి అన్ని కార్యాలయాలలో, అధికారిక సమావేశాల్లో, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని నిషేధి స్తున్నట్లు తెలిపారు. దీని ప్రత్యామ్నాయం గా స్టీల్ లేదా గాజు బాటిల్స్ వినియోగించాలని కోరారు. కార్యాలయ ఫైళ్ళు, టేబుళ్లు మరియు కార్యాలయ పరిసరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ లో చెత్తను తొలగించిన పోలీసులు



**విశాఖ ఉత్తరం పెన్ పవర్ జులై 19 :**స్థానిక 4వ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఉన్న చెత్తను పోలీసులు తొలగించారు. స్వర్ణంధ్ర, స్వచ్ఛాంధ్ర, కార్యక్రమం లో భాగంగా విశాఖ పట్నం పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు 4వ పట్టణ సీఐ ఎ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థలను పనికి రాని మొక్కలు ను చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భం గా సీఐ ఎ సత్యనారాయణ మాట్లాడుతు ప్లాస్టిక్ రహిత ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందిం చేందుకు ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషి చేయాల న్నారు. ప్రతీ ఒక్కరూ కొద్దీ సమయాన్ని వెచ్చిం చి తమ పరిసర ప్రాంతం లో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థలు తొలగించాలని కోరారు.

ఈ కార్యక్రమం లో 4వ పట్టణ ఎస్ ఐ వెంకట రావు, ఎస్ ఐ గణపతి, వరలక్ష్మి, కనక రాజు, వరహాలు, సుమన్, ప్రెసిడెంటిల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్వీ నగర్-పాలగెడ్డ రహదారి పనులపై నిర్లక్ష్యం

- ఆర్అండ్‌బీ అధికారులపై సీపీఐ మండిపాటు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 19:** అల్లూరి సీతారామరాజు గూడెం కొత్తవీధి మండలంలోని ఆర్వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతుల విషయంలో రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు విష్ణుమూర్తి ఆరోపించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన, గత ఏడాది సెప్టెంబరులో సంభవించిన తుఫాన్ కారణంగా రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని గుర్తు చేశారు. అయితే అప్పట్లో ప్రభుత్వమే కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేసి, టెండర్లు పూర్తయ్యాయి. అయినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం హేయమైన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు."మారుమూల మండలంగా ఉన్న గూడెం కొత్తవీధిని అధికారులు మొదటినుంచి చిన్నచూపు చూస్తున్నారు. కనీసం రాకపోకలకు వీలు కల్పించే రహదారి విషయంలోనూ ఈ విధంగా అలసత్వం ప్రదర్శించడం బాధాకరం," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పనులు ఆలస్యం కావడానికి అధికారులు ఉద్దేశపూర్వకంగా కారణమవుతున్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేసిన విష్ణుమూర్తి, నిధుల గోల్‌మాల్ కుట్ర ఏదైనా జరుగుతోందా అన్న అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయని అన్నారు. ఈ రహదారి దుర్వస్థత వల్ల గర్భిణీలు, అత్యవసర రోగులు సకాలంలో ఆసుపత్రికి చేరకపోతే, ఆర్అండ్‌బీ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సంచులను వాడకూడదని

## రైతు బజార్ అంతటా విస్తృతం గా ప్రచారం

- ఎంవీపీ రైతుబజార్లో ఘనంగా నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమం



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జులై 19 :**
ప్రతి నెల మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంతో మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ఆరో గ్యాంధ్ర ప్రదేశ్ కల సాకారం చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని ఎంవిపి కాలని రైతుబజార్లోని పరిసరాలను శుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ సంచులను వాడకూడదని రైతు బజార్ అంతటా విస్తృతం గా ప్రచారం చేశారు. రైతుబజార్లో ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ కి బదులుగా నార సంచులు వాడాలని వివరించారు. రైతుబజార్ పరిసరా ల్లోని వ్యర్థాలను శుభ్ర పరిచారు. అందరితో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు జి.కనకరాజు, శంకర రావు, జివిఎంసి సిబ్బంది, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ ప్యానల్ లాయర్ శ్రీలక్ష్మి, పారా లీగల్ వాలంటీర్ భవాని, రైస్ కౌంటర్ కె.మురళి కృష్ణ, రైతుబజా ర్ రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనతో

## పర్యావరణ పరిరక్షణ సాధ్యం

- 12,13 వార్డులలో ప్లాస్టిక్ నిర్మూలలపై అవగాహన కార్యక్రమాలు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూలై 19:**
ప్లాస్టిక్ నిర్మూలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు,స్థానిక శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు పర్యవేక్షణలో 12,13 వార్డులలో ప్రతి నెలలో మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలన పై అవగాహన సదస్సు 13 వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు. ఆధ్వర్యంలో స్వచ్ఛ - సర్వేక్షన్ వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొని ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించి,ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు ఈ యొక్క స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో వివరించడం జరిగింది. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడి సత్యం, విశాఖ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు ,

సచివాలయం శానిటేషన్ సిబ్బంది, వార్డులకు సంబంధించిన టిడిపి నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది. సూపర్వైజర్లు,ఆర్పీలు,స్థానిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎఎన్ఎం కు ఘనంగా సత్కరించిన ఆశ కార్యకర్తలు





- ఎఎన్ఎం సేవలు అపూర్వం.
- జోలపుట్టు సచివాలయం ఆశ కార్యకర్తలు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 19.**మండలంలో గల జోలపుట్టు సచివాలయంలో ఏఎన్ఎం గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కోయురు మండలానికి వెళ్తున్న ఏఎన్ఎం ఎం గౌరమ్మకు జోలపుట్టు సచివాలయ ఆశ కార్యకర్తలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. జోలపుట్టు సచివాలయ పరిధిలో ఏఎన్ఎం గౌరమ్మ సేవలు అపూర్వం అన్నారు. విధి నిర్వహణలో ఆశ కార్యకర్తలతో మమేకమవుతు ప్రజలకు వైద్య సేవలు అందించుటకు ముందుకు నడిపించే వారని ఆమె సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న చోట విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజా మన్ననలు పొందాలని, ఎఎన్ఎం గౌరమ్మ బదిలీపై వెళ్తున్నందుకు బాధగా ఉందని, ఆమె ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి నాగమణి, ఆశ కార్యకర్తలు కిముడు శాంతమ్మ, ఎస్ జయసుధ, కే సుభద్ర, రాధ, జెమ్మ, పుష్ప, కాంతమ్మ, ప్రమీల, పానమ్మ, కొండమ్మ, కమల, బి పుష్ప, బుల్లమ్మ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు





- ప్లాస్టిక్ వస్తువులను తొలగించి, పరిశుభ్రతా చర్యలు చేపట్టిన ఉద్యోగులు
- ఎండాడ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్టణం, జూలై 19 :**రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టా రు. అధికారులు, సిబ్బంది పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. జూలై మాసంలోని మూడో శనివారం థీమ్ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొద్దిద్దాం అనే నినాదంలో భాగంగా పనికిరాని పాత వస్తువుల ను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. కార్యాలయాల ఆవరణల్లోని పిచ్చి మొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా మందులను పిచికారీ చేశారు. తుప్పు పట్టిన ఇనుప వస్తువులను తొలగించారు. పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులను ఒకచోట వేసి నిప్పింటించారు. పరిసరాల్లో శుభ్రతా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది ఒకచోట చేరి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకు దామని పేర్కొంటూ సామూహిక ప్రతిజ్ఞలు చేశారు. కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఎండాడ ఆర్.ఆర్. ఆర్. సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్ కాలుష్య నివారణ బాధ్యత అందరిపైనా ఉంది




ఐటీడీఏ ఇన్చార్జి పీవో జెసి ఎం.జె.అభిషేక్ గౌడ



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 19:** ప్లాస్టిక్ కాలుష్య నివారణ బాధ్యత ప్రతీ ఒక్కరిదీ అని ఐటిడిఏ ఇంచార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం. జె.అభిషేక్ గౌడ పేర్కొన్నారు. శనివారం పాడేరు ఐటిడిఏ కార్యాలయం నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు నిర్వహించిన స్వచ్ఛాంధ్రా - స్వర్ణాంధ్రా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉందని, వారపు సంతలు, పర్యాటక ప్రాంతాలలో వాటర్ బాటిళ్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల నీటి వనరులు తీవ్రంగా కాలుష్యానికి గురవుతుండటాన్ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ ఓలు తదితర అధికారులు ప్లాస్టిక్ నిషేధానికి గట్టి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను వాడకూడదన్న బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట్ సాహిత్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ భూమిలో నలభై వందల ఏళ్ల పాటు మిగిలి, పర్యావరణాన్ని హానిచేస్తుందని పేర్కొన్నారు. ఇది జల కాలుష్యానికి దారితీస్తుందనీ, దీని వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వర నాయుడు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, ఇతర వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో

## ప్రజలకు అవగాహన కల్పించిన ఎంపిపి






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ జూలై 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో ఎంపీపీ బోయిన కుమారి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ అన్నాజి రావు, డిప్యూటీ ఎంపీడీవో మహేష్, స్థానిక సర్పంచ్ కోర్ర సుభద్ర లతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలని వాటిని నిషేధించాలని అన్నారు. అలాగే వర్షాకాలం కనుక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్య సమస్యలు సంభవించకుండా ముందుకు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ్ ఆంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పోటీల నిర్వహణకు విశాఖ అనుకూలం







- అంతర్జాతీయ క్రీడావేదికగా విశాఖను తీర్చిదిద్దుతాం
- ఏపీలో క్రీడాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి
- క్రీడలు, క్రీడాకారుల విషయంలో శాప్ రాజీపడేది లేదు
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జులై 19 :** ఒలింపిక్స్ స్థాయి క్రీడాసదుపాయాలు కల్పినకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతిపాదిం చాలి వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు విశాఖపట్టణం అనుకూలం గా ఉంటుందని, అత్యుత్తమ ప్రమాణాలతో అంతర్జాతీయ క్రీడావేదికగా విశాఖను తీర్చిదిద్దుతామని వెస్ట్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు(గణబాబు), శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక జీవీఎంసీ అక్వాటిక్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో నిర్వహించిన 10వ ఏపీ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలను వారిరువురి చేతులు మీదుగా శనివారం ప్రారంభించారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన స్పోర్ట్స్ టీమ్‌లు మార్చ్‌పాస్ట్ నిర్వహించిన అనంతరం శాప్ డైరెక్టర్లు, అక్వాటిక్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పావురాలను విడిచిపెట్టి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఏపీలో క్రీడాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలు అభివృద్ధి చెందాయంటే ఆనాడు ఆయన చేసిన అభివృద్ధే కారణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్విమ్మింగ్ పూల్స్ అన్ని మున్సిపాలిటీలు, అర్బన్ అథారిటీ పరిధిలో ఉన్నాయని, స్విమ్మింగ్ పూల్స్ నిర్వహణ విషయంలో సంబంధిత శాఖలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. దీనిపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ కూడా ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. క్రీడలు, క్రీడాకారుల విషయంలో శాప్ రాజీపడే ప్రసక్తే లేదని, క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని క్రీడలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సాయశక్తులా కృషి చేస్తుందన్నారు. పీ-3, పీ-4 విధానంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు పారిశ్రామికవేత్తులు, వ్యాపారవేత్తలు, దాతలు ముందుకొచ్చి క్రీడాసదుపాయాలకు కల్పనకు సహకరించాలని కోరారు. దీనికి సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, శాప్ నుంచి సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నా రు. మెగా క్రీడా వేదికగా విశాఖను తీర్చిద్దుతాం.

రాష్ట్రంలోనే క్రీడలకు విశాఖపట్టణం పెద్దపీట వేస్తుందని, జాతీయ, ఏషియన్, అంతర్జాతీయ క్రీడలను సైతం నిర్వహించుకునేందుకు అనుగు ణంగా మెగా క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామని వెస్ట్ ఎమ్మెల్యే పీజీవీఆర్.నాయుడు(గణబాబు) అన్నారు. అంతర్జాతీయ పోటీల నిర్వహణకు విశాఖ అనుకూలంగా ఉంటుందని, విశాఖలో నూ ఒలింపిక్స్ స్థాయి క్రీడాసదుపాయాలు కల్పించేందుకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతిపాదించాలని అన్నారు. 32 క్రీడలకుగానూ 8 క్రీడలకు విశాఖపట్టణం వేదికగా నిలుస్తుందన్నారు. ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీతలు సైతం ఇక్కడ అనేకమంది ఉన్నారన్నారు. 2027లో విశాఖపట్టణంలో ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారని, దానికి అనుగుణంగా క్రీడాసదుపాయాలు కల్పించేందుకు శాప్, వీఎమ్ఆర్డీఏ కృషి చేస్తుందన్నారు.డీఎస్ఏ ఇండోర్ హాలు పరిశీలన..విశాఖపట్టణంలోని పాండురంగా పురంలో ఆధునికరిస్తున్న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ హాలు పనులను శాప్ ఛైర్మన్ రవినాయుడు శనివారం పరిశీలించారు. త్వరిత గతిన పనులను పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించా రు. పోస్టర్ ఆవిష్కరణ.ఆగస్టు 15, 16 తేదీల్లో వైజాగ్‌లో నిర్వహించనున్న "న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్ వైజాగ్" పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు శాప్ ఛైర్మన్ రవినాయుడు విశాఖపట్ట ణంలోని అక్వాటిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఈరోజు ఆవిష్కరించారు. కరణం మల్లీశ్వరిని కలిసిన శాప్ ఛైర్మన్.రిటైర్డ్ ఇండియన్ వెయిట్ లిఫ్టర్ శ్రీమతి కరణం మల్లీశ్వరిని విశాఖపట్టణం లోని ఓ హొటల్‌లో శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని స్థాపించాలని, దానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె కూడా సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు పి.బి.వి.ఎస్.ఎన్.బుచ్చిరాజు, కొవ్వాసు జగదీశ్వరి, ఎమ్.డి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## జగన్ ఫోటో ఉంటేనే చంద్రబాబుకి వణుకు

- కూటమి చెప్పిందొకటి.చేసేది మరొకటి!
- మేనిఫెస్టో అంశాలు అన్ని అబద్ధాలే!
- 34వార్డు బాబు షూరిటీ మోసం గ్యారంటీలో వాసుపల్లి ధ్వజం.



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 19 :** జననేత జగనన్నను ఓడించేందుకు ఒంటరిగా వచ్చే దమ్ము లేక చంద్రబాబు మూకుమ్మడిగా పార్టీలతో జతకట్టి గెలిచినప్పటికీ నిజమైన ప్రజాబలంలో వైయస్సార్సీపిదే విజయమని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా జగనన్న పై పెంచుకున్న ప్రజా ఆదరణ చూసి చంద్రబాబు ఓర్వలేక అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో వాసుపల్లి తో పాటు స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ బోలవరపు జాన్ వెస్లీ,జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్ పాల్గొని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు మా జగనన్న పేరు వెంటనే చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతుందని వాసుపల్లి అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ తిరిగినా ఏ నోట విన్న ఇంకా జగనన్న మాటే వినిపిస్తుందన్నారు. ఆయన ఇంటింటికీ ఇచ్చిన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో పేదలకు చేరడం లేదన్నారు. జగన్ ఫోటో ఉంటేనే వణికిపోతున్న పచ్చనేతలు ఆయన పథకాలను కూడా కనుమరుగు చేశారని సంబర పడిపోతున్నార న్నారు. కానీ త్వరలో జగనన్న ప్రభుత్వం రానున్నదని, పేదల పక్షాన వైఎస్ఆర్సిపి నిలబడి న్యాయ పోరాటం చేస్తామని తెలియచేశారు. కార్యక్రమంలో శ్రీ ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, రాష్ట్ర నాయకులు లింగం శీను, జిల్లా వాలంటరీ విభాగం ఉపాధ్యక్షుడు దూడ అప్పారావు, అది విష్ణు, బడ్డీ బోయిన అప్పారావు, గరికిన వెంకటేష్, కడవల నాగమణి, అంబతి అప్పలరాజు, సీనియర్ నాయకులు గార తాత అబ్బాయి, పిల్లి సత్తిబాబు, యేసాలపు రాజు, వాసుపల్లి చిన్న, సూరాడ లక్ష్మణరావు, నగల శ్రీను, చల్ల పిల్లి సత్తిరాజు, గాలి పార్వతి, వాసుపల్లి ధనరాజు, స్టేట్ మాజీ డైరెక్టర్ రేయి డేవిడ్ రాజ్ ,స్టేట్ %=×% సెక్రటరీ దస్మాంతుల చిన్ని, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి ఆది విష్ణు, కార్పొరేటర్ బిపిన్ జైన్, కో ఆప్షన్ మెంబర్ షరీఫ్,%జుఇ% కార్పొరేటర్ పచ్చరపల్లి రాము, వార్డ్ ప్రెసిడెంట్ వాసు పీతల, భీశెట్టి ప్రసాద్,రాజా రెడ్డి, ముత్తబాటుల రమేష్ ,లక్ష్మి,దశమంతులు మాణిక్యాలరావు,నీలపు సర్వేశ్వర రెడ్డి, ముజీబ్ ఖాన్, మెహమ్మద్ యాషిన్ ,అరుగుల రాజుబడిబోయిన గోవిందా,లక్ష్మి, సాయి ,సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు ఆకుల శ్యామ్,సూర్య నాయుడు,సువర్ణ రాజు,కొణతాల కృష్ణవేణి,కోటి, కోరాడ సురేష్, సాగర్, రాంరాజు, బుల్లెట్ రవి,తమ్మినేని శ్రీను,చేపల నూకరాజు (బుడ్డి ), పడాల సూర్య,చింతకాయల వాసు, చేపల రాజు, మౌళిష్,నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి బ్యాంక్ రుణాలు మంజూరుకై చైర్మన్ కి వినతి



**గాజువాక :పెన్ పవర్ ,జూలై 19**
బి హెచ్ ఈ ఏల్ ,హెచ్ పి వి పి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో
జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మెన్ కోన తాతా రావు ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడి ఉన్నటువంటి కుటుంబాలలో ఎస్సీ ఎస్టీ లు వ్యాపారం చేసే వాళ్ళకి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ముందుకు వెళ్లే వారిని ప్రోత్సహించాలని లోన్స్ ఇప్పించే విధంగా కృషి చేయాలని కోరారు . దానికి వారు సానుకూలంగా స్పందించి నిజాయితీగా వ్యాపారం చేసుకున్న ప్రతి ఒక్క కుటుంబానికి కూడా

డిసిసిబి తరపున ప్రోత్సహిస్తామని తక్కువ వడ్డీ రేట్లకే లోన్స్ వస్తాయని హామీ ఇచ్చారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు . ఈ కార్యక్రమంలో కొల్లి దేముడు, కంచిపాటి ప్రకాష్, ముద్రగడ శ్వేత, టెక్కలి భాస్కరరావు పాల్గొన్నారు అని ఒక ప్రకటనలో తెలియజేయుచున్నాను

## పేద కుటుంబానికి వాసుపల్లి రూ.5000 ఆర్థిక సాయం

దక్షిణ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే నిస్వార్థ సేవలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 19 :** దక్షిణ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, గణేష్ కుమార్ నిస్వార్థ సేవలో నిరంతర ఆర్థిక సాయం చేస్తుండడం ఆదర్శంగా నిలుస్తున్నాయి. శనివారం ఉదయం బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఓ పేద ఇంటికి వెళ్లిన వాసుపల్లికి వారి కష్టాలు చూసి చలించి తన సొంత నిధులతో ఆదారి వెంకటలక్ష్మికి 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచమని చెప్పి బిల్లులు మోత మోగించడమే కాక ఆ పేరుతో పథకాలు తొలగించడం పట్ల పేదలు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. మళ్లీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు అమర్చి స్మార్ట్ గా ప్రజల నుండి వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీనిని ప్రజలు వ్యతిరేకించాలని వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. కార్యక్రమంలో
జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్,33 వ వార్డు ప్రెసిడెంట్ ముత్తాబత్తుల రమేష్, 33వ వార్డు ఎక్స్ కార్పొరేటర్ పచ్చి పిల్లి రాము, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు వాసాల సుబ్రమణ్యం (సువార్త రాజు), ఆకులు శ్యామ్, సూర్య నాయుడు, అరుగుల రాజు,రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగల్ యూజ్ ప్లాస్టిక్ వలన జరుగు నష్టాలు అవగాహన ర్యాలీ







**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జులై 19 :** ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ప్రతిష్టాత్మక స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం కింగ్ జార్జ్ ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. ఐ. వాణి థీమ్ అయిన ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ మీద ఆసుపత్రి డాక్టర్స్, నర్సులు, నర్సింగ్ విద్యార్థు లు మరియు సిబ్బందితో ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించి, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వలన జరుగు నష్టాలు తెలియచేస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రం లో కలిసి పోవడం వలన సముద్ర జీవాలకు కూడా ప్రమాదకరం అని పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని క్యాన్సర్ కి కూడా ఇది ఒక కారణం కాబట్టి, అందరూ ఈ వ్యర్థాలు బయట పడవేయకుండా రీసైక్లింగ్ చేసే సంస్థలకు అందచేసి ఈ వ్యర్థాల వలన కలిగే నష్టాలను తగ్గించడానికి కృషి చేయాలి అని అవగాహన కల్పించారు. నర్సింగ్ స్టూడెంట్స్ కి ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ మీద పోటీలు నిర్వహించి ప్రైజెస్ కూడా అందచేయడం జరిగింది తర్వాత హాస్పిటల్ లో %ాఖూ% మీద ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్.ఐ వాణి గారితో పాటు డిప్యూటీ సూపరింటెండెం ట్లు డా.డి. రాధాకృష్ణన్, డా.జి.వాసవిలత, డా.వి.రవి, అడ్మినిస్ట్రేటర్ బి. వి. రమణ, స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డా.ఏ.రాజేష్, ఆర్ ఎం ఒ బంగారయ్య,నర్సింగ్ సూపరింటెండెంట్లు సి. హెచ్.పద్మావతి. మినిస్టీరియల్ సిబ్బంది మరియు నర్సింగ్ స్టూడెంట్స్ ఈ యొక్క కార్యక్రమం లో పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని



- పలు కేసులు ఉన్న నిందితుడు కుప్పిలి నవీన్ పై పి.డి.యాక్ట్
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జులై 19 :** చట్టాన్ని తరుచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ, భౌతిక దాడులకు పాల్పడుతూ, పలు కేసుల్లో నిందితుడిగా అరెస్టయిన రాజాం మండలం గురువాం గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్ (19సం.లు) అనే వ్యక్తిపై పి.డి.యాక్ట్ ప్రయోగించి, ముందస్తు నేర నియంత్రణ చర్య ల్లో భాగంగా అతడిని నిర్భందించి, విశాఖపట్నం కేంద్ర కారాగానికి తరలించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూలై 19న తెలిపారు. విజయన గరం జిల్లా రాజాం మండలం గురువాం గ్రామం లో నివాసం ఉంటున్న నిందితుడు కుప్పిలి నవీన్ అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడి, ప్రజలతో అహంకారంతో దురుసుగా ప్రవర్తిస్తూ, ఇతరులకు హాని కలిగించే విధంగా చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ, భౌతిక దాడులకు పాల్పడుతూ, గత ఐదు సంవత్సరాల్లో విజయనగరం జిల్లా రాజాం పోలీసు స్టేషనులో 4 కేసుల్లోను, సంతకవిటి పోలీసు స్టేషనులో 8 కేసుల్లోను (మొత్తం 12కేసులు) నిందితుడిగా అరెస్టు అయ్యారన్నారు. కుప్పిలి నవీన్ ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా కుప్పిలి నవీన్ (19 సం.లు)పై పి.డి.యాక్ట్ అమలు చేయాలని కోరుతూ రాజాం పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయంకు ప్రతిపాదనలు పంపగా, వాటిని సిఫార్సుచేస్తూ జిల్లా కలెక్టరు డా. బి.ఆర్. అంబేద్కర్ గార్కి ప్రతిపాదనలు పంపామన్నా రు. నిందితుడు కుప్పిలి నవీన్ పై ఇప్పటికే రాజాం పోలీసు స్టేషనులో రౌడీ షీటు ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. రాజాం పోలీసుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టరు డా.బి.ఆర్.అంబే ద్కరు పరిశీలించి, నిందితుడి ప్రవర్తన సమాజానికి ప్రమాదకరంగా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తిగా మారుతున్నాడని భావించి, నిందితుడు కుప్పిలి నవీన్ ను నిర్భందించి, విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినా, చైన్ స్నాచింగ్స్, రోబరీ, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడినా, భూదురాక్రమణలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి నిందితులను గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టడానికి వెనుకాడబో మన్నారు. నిందితుల ప్రవర్తనను ఎప్పడప్పుడు పరిశీలించి, అటువంటి వ్యక్తులపై షీట్లు ప్రారంభించడం, పి.డి.యాక్టుకు ప్రయోగించడం, నేరాల నియంత్రణకు ముందస్తుగా నిర్భందిస్తామన్నారు. కావున, నిందితులు సత్ప్రవర్తనతో, చట్టాన్ని గౌరవిస్తూ జీవించాల ని, నేర ప్రవృత్తిని విడనాడాలన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపైనా, వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టుకాబడిన నిందితులపై నిరంతర నిఘా ఉంటుందని, ఎవరైనా చట్ట వ్యతిరేక
కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

## పెందుర్తి పోలీస్ స్టేషన్లో స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం



**పెందుర్తి, పెన్ పవర్, జూలై 19 :** విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి ఆదేశాల మేరకు, జోన్-2 డీసీపీ మేరీ ప్రసాంతి మార్గదర్శనంలో, వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృధ్వీరాజు పర్యవేక్షణలో ఈ రోజు పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ నాయకత్వంలో స్వచ్ఛంద్ర మరియు స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణ, కార్యాలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు మరియు స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త దుమ్ము తొలగించడమే కాకుండా, వాహనాల నిలిపివేతను క్రమబద్ధీకరించడం, చెత్త నిర్మూలన వంటి చర్యలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది అందరూ సమిష్టిగా పాల్గొని, శ్రద్ధా భక్తులతో శు భ్రతా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా శుభ్రత పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం ఏర్పడి, ఇతర శాఖలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సాగింది. పౌరుల్లో స్వచ్ఛత పట్ల అవగాహన పెంచడం, ప్రజాస్వామిక కర్తవ్యంలో భాగంగా పోలీసులు కూడా ముందుండి మద్దతు ఇస్తున్నదీ కార్యక్రమం ఒక ప్రతిభావంతమైన మానవీయ చొరవగా నిలిచిందని అన్నారు.ు

## నేత్రపర్వంగా సాగిన స్వామివారి గరుడ సేవ





**సింహాచలం, పెన్ పవర్, జూలై 19 :** దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం,
శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానంలో స్వామివారి గరుడ సేవ నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్టింపజేశారు. గరుడ సేవలో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# న్యూడ్ ఫొటో.. ట్రంప్ తో పెట్టుకుంటే అట్లుంటది మరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా చర్చనీయాంశంగా మారారు. ఈసారి ట్రంప్‌ను వార్తల్లో నిలిపింది ఒక నగ్న చిత్రం, జెఫ్రీ ఎప్‌స్టైన్‌కు పంపిన లేఖ, ప్రముఖ వార్తా సంస్థ వాల్ స్ట్రీట్ జర్నల్‌పై దాఖలు చేసిన భారీ పరువు నష్టం దావాతో హీట్ పెరిగింది.. ఈ మొత్తం వ్యవహారం అమెరికా రాజకీయాలు, మీడియా, న్యాయ వ్యవస్థల్లో ఒక సంచలనం సృష్టిస్తోంది.

**వార్తల్లో ఏముంది?**

వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం ప్రకారం.., 2003లో జెఫ్రీ ఎప్‌స్టైన్ పుట్టిన రోజు సందర్భంగా ట్రంప్ ఒక శుభాకాంక్షల లేఖను పంపారు. ఆ లేఖలో ఒక మహిళ నగ్న చిత్రాన్ని చేర్చి, దానిపై ట్రంప్ సంతకం చేసి, "హ్యాపీ బర్త్‌డే.. నీ ప్రతి రోజు ఓ అందమైన రహస్యంగా మారాలని ఆకాంక్షిస్తున్నా" అని రాశారని ఆ కథనంలో పేర్కొంది. ఈ ఆరోపణలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. తనపై అవాస్తవ ప్రచారం చేశారంటూ వాల్ స్ట్రీట్ జర్నల్ మాతృసంస్థ న్యూస్ కార్పొరేషన్, దాని యజమాని రూపర్ట్ మర్డోక్, సీఈఓ రాబర్ట్ థామ్సన్‌తో పాటు ఇద్దరు జర్నలిస్టులపై ?86,000 కోట్ల (దాదాపు 10 బిలియన్ డాలర్ల) పరువు నష్టం దావా వేస్తూ మియామీ ఫెడరల్ కోర్టులో కేసు దాఖలు చేశారు.

**ట్రంప్ ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు?**

ట్రంప్ తన ప్రతిష్టకు భంగం వాటిల్లిందని, ఆర్థిక నష్టం కూడా వాటిల్లిందని ఆరోపిస్తున్నారు. రాజకీయంగా కీలకమైన ఈ సమయంలో ఇలాంటి వివాదాలు ఆయన ఎన్నికల ప్రచారానికి ఆటంకం కలిగిస్తాయని ఆయన భావిస్తున్నారు. అందుకే, వాల్ స్ట్రీట్ జర్నల్‌పై ఇంత పెద్ద మొత్తంలో దావా వేసి, తన తీవ్రమైన వైఖరిని తెలియజేశారు.

**జెఫ్రీ ఎప్‌స్టైన్ తో ట్రంప్ సంబంధాలు.. పాత జ్ఞాపకాలు**

ట్రంప్ గతంలో జెఫ్రీ ఎప్‌స్టైన్‌ను గురించి మాట్లాడుతూ "అతడు అద్భుతమైన వ్యక్తి. అతనికి కూడా నాకు లాగే అందమైన యువతులు, బాలికలు ఇష్టమయ్యేవి" అని వ్యాఖ్యానించారు. అయితే, ఆర్థిక విషయాల్లో విభేదాలు తలెత్తడంతో 2006లో అతనితో సంబంధాలు తెంచుకున్నానని ట్రంప్ చెప్పారు. ఎప్‌స్టైన్ సెక్స్ ట్రాఫికింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 2019లో అతడిని అరెస్టు చేసినా, అదే ఏడాది ఆగస్టులో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ కేసు రాజకీయ, మీడియా వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ట్రంప్–ఎప్‌స్టైన్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 1990 నుండి 2000 మధ్య ఫ్లోరిడాలో ఇద్దరూ పక్కపక్కనే నివసించేవారంటూ పేర్కొన్నారు. ఇవన్నీ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ ప్రస్తుత వివాదాన్ని మరింత రాజేస్తున్నాయి.

ఈ మొత్తం వ్యవహారంలో అనేక ప్రశ్నలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొన్న విధంగా, ట్రంప్ నిజంగా ఆ లేఖను పంపారా? ఆ లేఖకు సంబంధించిన ఆధారాలు ఏవి? అన్నది ప్రశ్న. వార్తా సంస్థ ఈ సంచలన కథనాన్ని ప్రచురించడానికి ముందు ఏ రకమైన ఆధారాలను సేకరించింది? అవి ఎంతవరకు విశ్వసనీయమైనవి? అన్నది చూసుకోవాలి. ట్రంప్ దాఖలు చేసిన ?86,000 కోట్ల పరువు నష్టం దావా న్యాయస్థానంలో నిలుస్తుందా? దీనికి సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ ఎలా సాగుతుందన్నది చూడాలి. ఈ వివాదం ట్రంప్ ఎన్నికల ప్రచారానికి ఎలాంటి ప్రభావం చూపుతుంది? మీడియా వర్గాల్లో ఇది ఎలాంటి చర్చకు దారి తీస్తుంది? అన్నది వేచిచూడాలి.

ఇది ట్రంప్‌కు వచ్చిన మరో వివాదంగా మారింది. ఒకవైపు అధ్యక్షుడు, మరోవైపు అమెరికా ప్రధాన మీడియా సంస్థల మధ్య హై–ప్రొఫైల్ పోరు మొదలైంది. ఈ మొత్తం వ్యవహారం అమెరికా రాజకీయ, న్యాయ, మీడియా రంగాలలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి. నిజం ఏదైనా, ఈ వివాదం రాబోయే రోజుల్లో మరింత చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది.

# హైదరాబాద్ లో టెన్షన్ పెట్టిన ఎయిరిండియా ఎక్స్ ప్రెస్... ఏమైందంటే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** మరో ఎయిరిండియా విమానం తాజాగా హైదరాబాద్ లో టెన్షన్ పెట్టిందంటూ నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెడుతున్నారు. హైదరాబాద్ నుంచి థాయిలాండ్ కు బయలుదేరిన విమానం.. శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన 16 నిమిషాలకే తిరిగి వచ్చేసింది. దీంతో ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. అవును.. గత కొన్ని రోజులుగా పలు విమానయాన సంస్థల్లోని విమానాలు సాంకేతిక సమస్యలతో టెన్షన్ పెడుతోన్న సంగతి తెలిసిందే. గత వారం పదిరోజుల్లోనే వరుసగా పలు ఘటనలు తెరపైకి వచ్చాయి. దీంతో.. పలు విమానాలను అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విమానం బయలుదేరిన కొన్ని నిమిషాలకే తిరిగి వచ్చేసింది. వివరాల్లోకి వెళ్తే... థాయిలాండ్ లోని పుకెట్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విమానం శనివారం ఉదయం టెకాఫ్ అయిన కొద్ది సేపటికే తిరిగి హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చేసింది. ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం... బోయింగ్ 737 మాక్స్ 8 ద్వారా నిర్వహించబడుతున్న ఫ్లైట్ ఐఎక్స్ 110 ఉదయం 6:41 గంటలకు బయలుదేరింది. ఈ విమానం ఉదయం 11:45 గంటలకు పుకెట్ లో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే... 6:57 గంటలకే తిరిగి హైదరాబాద్ కు వచ్చేసింది. అంటే.. కేవలం 16 నిమిషాలు మాత్రమే ప్రయాణించిందన్నమాట. ఈ విషయంపై నిరాశ చెందిన ప్రయాణికులు.. విమానయాన సంస్థ నుండి సరైన సమాచారం లేకపోవడంతో విమానం లోపల వేచి ఉండాల్సి వచ్చిందని అంటున్నారు. ఈ సందర్భంగా... "విమానం ఐఎక్స్110 హైదరాబాద్ నుంచి పుకెట్ కు వెళుతుండగా టేకాఫ్ తర్వాత తిరిగి వచ్చింది. ఇంకా ఎటువంటి సమాచారం లేదు. మేము విమానం లోపల వేచి ఉన్నాము. ఇది చాలా నిరాశ పరిచింది" అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎయిరిండియా ఎక్స్ ప్రెస్, డీజీసీఏ ను ట్యాగ్ చేశారు! దీనిపై ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ 'ఎక్స్' వేదికగా స్పందించింది. ఈ సందర్భంగా జరిగిన అంతరాయానికి క్షమాపణలు చెబుతూ, సాంకేతిక లోపం వల్ల ఆలస్యం జరిగిందని స్పష్టం చేసింది. ఈ అసౌకర్యానికి మేము క్షమాపణలు కోరుతున్నట్లు చెబుతూ.. ప్రయాణికుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యత అని వివరించింది.

# 'నా ఇంట్లోని స్టోర్ రూంలో క్యాష్ దొరికితే దోషిని ఎందుకవుతా?'



**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్ని నెలల క్రితం (మార్చి 14 రాత్రి) ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్ రూంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు బయటపడటం.. ఆ ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలోసగం కాలిన కరెన్సీ నోట్లు భారీగా బయటకు రావటం..అదో పెను సంచలనంగా మారటం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన్ను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ పై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అభిశంసన తీర్మానం పెట్టాలని భావిస్తున్నారు. ఈ ఇష్యూ పెను సంచలనంగా మారి సుప్రీంకోర్టుపై పెద్ద ఎత్తున విమర్శలు కురిపించినోళ్లు ఉన్నారు.

ఈ క్రమంలో సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కలిసి విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ విచారణ కమిటీలో పంజాబ్.. హర్యానా చీఫ్ జస్టిస్ షీల్ నాగ్, హిమాచల్ ప్రదేశ్ చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ ఉన్న సంగతి తెలిసిందే.

ఇదిలాఉండగా.. ఈ కేసుకు సంబంధించి తాజాగా ఒక అప్డేట్ తెర మీదకు వచ్చింది. తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అధికారిక నివాసంలోని స్టోర్ రూంలో పెద్ద ఎత్తున నగదు కట్టలు దొరికినంత మాత్రమే తాను దోషిని ఎందుకు అవుతానని ఆయన వాదిస్తున్నారు. తన కెరీర్ లో ఎక్కడా మచ్చ అన్నది లేకుండా పదకొండేళ్లు న్యాయమూర్తిగా పని చేసిన వైనాన్ని ప్రస్తావించటం గమనార్హం.

విచాణ కమిటీ చేపట్టిన ప్రక్రియను తప్పు పడుతూ.. అదంతా లోపాలమయంగా పేరకొన్నారు. తన వాదన వినిపించుకోవటానికి తగినంత సమయం ఇవ్వలేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ లో పేర్కొన్నారు. తన అధికారిక నివాసంలో దొరికిన నోట్ల కట్టలకు యజమాని ఎవరన్నది కమిటీ గుర్తించలేదన్న ఆయన.. కొన్ని ఊహాగానాలతో ఒక ఆధారంగా వచ్చారని.. తన దృష్టిలో అవేమీ చెల్లవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏం జరగనుంది? సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తున్నది ఆసక్తికరంగా మారింది.

# సీఎం గా పవన్ ...అదన్న మాట మ్యాటర్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** పవన్ కళ్యాణ్ ని సీఎం అని అభిమానులు కేకలు వేస్తూ నినాదాలు చేస్తూ ఉంటారు. తమ అభిమాన వెండితెర కథానాయకుడు సీఎం కావాలన్నది వారి ఆశ. అది ఈ రోజున కాదు, 2014 నుంచే వారు అలా నినాదాలు ఇస్తూనే ఉన్నారు. అయితే 2024 నాటికి అందులో ఎంతో కొంత ఫలించి పవన్ డిప్యూటీ సీఎం అయ్యారు. మరి అక్కడ నుంచి సీఎం గా ప్రయాణం ఎంత దూరం ఎంతకాలం అంటే దానికి జవాబు అయితే ఎవరికీ దొరకదు. కానీ ఏదో నాటికి తన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి అయి తీరుతారు అన్నది మాత్రం అభిమాన జనం పెట్టుకున్న విశ్వాసం. ఇవన్నీ పక్కన పెడితే గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాలలో ఒక వార్త వైరల్ అవుతోంది. అది ఇంతకు ఇంతగా పెరిగి పెద్దదై భారీ ప్రచారంగా అవుతోంది. ఇంతకీ మ్యాటర్ ఏంటి అంటే పవన్ కళ్యాణ్ సీఎం అవుతారు అని. అది కూడా కొద్ది రోజులలోనే. నిజంగా జనసైనికులకు పవన్ ఫ్యాన్స్ కి ఈ వార్త చాలా ఆనందం కలిగించేదే. అదెలా అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారా లోకేష్ సహా ముఖ్య నేతలు అంతా ఈ నెల 26 నుంచి ఒక అయిదారు రోజుల పాటు సింగపూర్ పర్యటనకు వెళ్తున్నారు.

అంటే బాబు సీఎం అయిన తరువాత ఇది రెండవ విదేశీ పర్యటన అనుకోవాల్సి ఉంది తొలిసారి ఆయన పెట్టుబడుల కోసం విదేశీ పర్యటన చేశారు. అపుడు కూడా బాబు లోకేష్ సహా కీలక నేతలు వెళ్లారు ఈసారి కూడా సింగపూర్ కి బాబు అండ్ మినిస్టర్స్ వెళ్తున్నారు. అయితే ఇక్కడ బాబు విదేశీ టూర్ కంటే పవన్ సీఎం అన్న వార్త హైలెట్ అయింది. బాబు లేని అయిదారు రోజుల పాటు ఏపీలో పాలనాపరమైన వ్యవహారాలు చూసుకునేందుకు ఇంచార్జిగా పవన్ కి బాధ్యతలు అప్పగిస్తారు అన్నది వా వార్త సారాంశం. ఇది ఎలా వ్యాపించిందో తెలియదు కానీ పవన్ సీఎం అంటూ వైరల్ చేశారు. కొద్ది రోజుల పాటు అయినా పవన్ సీఎం గా పీఠమెక్కుతారు అని కూడా ప్రచారం చేసుకొచ్చారు. అయితే అది అలా జరగదని అంటున్నారు. బాబు విదేశాలకు వెళ్ళినా అక్కడ నుంచే పాలనను చేస్తారు అని అంటున్నారు. అన్నీ ఆయన విదేశం నుంచే ఆపరేట్ చేస్తారు అని అంటున్నారు. బాబు ఇపుడే కాదు, గతంలో సీఎం గా ఉన్నపుడు కూడా తన బదులుగా ఒకరో ఒకరిని ఇంచార్జిగా నియమించి బాధ్యతలు అప్పగించిన దాఖలాలు లేవని అంటున్నారు. పైగా బాబు టెక్నాలజీలో నిష్ణాతుడు. ఆయన అందరి కంటే ఎక్కువగా వాడుతారు. అలాంటి బాబు ఏ దేశంలో ఉన్న రియల్ టైం గవర్నెన్స్ అందించే సామర్థ్యం సత్తా ఆసక్తి అన్నీ కలిగి ఉన్నారని అంటున్నారు. అది గతంలో కూడా ఎన్నో సార్లు రుజువు అయింది. అందువల్ల ఈసారి కూడా బాబు సింగపూర్ టూర్ లో తానే మొత్తం ఏపీ పాలనా వ్యవహారాలు మోనిటరింగ్ చేసుకుంటారు అని అంటున్నారు. ఆ మాటకు వస్తే ఇటీవల కాలంలో టెక్నాలజీ పెరిగాక దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఏ సీఎం కూడా తన విదేశీ పర్యటనలకు వెళ్ళినపుడు ఇంచార్జి బాధ్యతలు అని ఎవరికీ అప్పగించడం లేదు అని గుర్తు చేస్తున్నారు. ఎవరు ఎక్కడ నుంచి అయినా చాలా ఈజీగా ఆపరేట్ చేసే టెక్నాలజీ వచ్చిన నేపథ్యంలో అంతా అలాగే చేస్తున్నారు. సో పవన్ కి సీఎం గా కొన్ని రోజుల పాటు బాధ్యతలు ఇస్తారు అన్నది ఒక ప్రచారం మాత్రమే అని అంటున్నారు. జనసేన క్యాడర్ లో ఆశలు రేపి కూటమి మధ్యన ఉన్న మంచి వాతావరణాన్ని దెబ్బ తీసేందుకు ఈ రకమైన ప్రచారం చేస్తున్నారు అని కూడా అంటున్నారు. అదన్న మాట మ్యాటర్.

# ఇలాంటి వారికి డబ్బు ఇస్తున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రాచీన భారతదేశపు గొప్ప తత్వవేత్తలలో ఒకరైన ఆచార్య చాణక్యుడు.. తన "చాణక్య నీతి" ద్వారా జీవితం, ధనం, నైతికత, రాజకీయం వంటి అనేక రంగాలలో అమూల్యమైన బోధనలు అందించారు. ఈ బోధనలలో ఒకటి ఎవరికైనా డబ్బు ఇచ్చే ముందు రెండుసార్లు ఆలోచించాలి అనే సూచన. చాణక్యుని మాటల్లో చెప్పాలంటే, "తప్పుడు వ్యక్తులకు డబ్బు ఇస్తే అది పోవడమే కాకుండా మీకే సమస్యలు తెచ్చిపెడుతుంది." ఈ మాటలు కేవలం ఆధ్యాత్మికంగానే కాకుండా, ఆచరణాత్మకంగా కూడా ఎంతో సత్యమైనవి.

**ఈ వ్యక్తులకు డబ్బు ఇవ్వడం ప్రమాదకరం!**

చాణక్యుడు ముఖ్యంగా నలుగురు రకాల వ్యక్తులకు ధన సహాయం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. చాణక్యుని ప్రకారం.. మూరు?లకు డబ్బు ఇవ్వడం అంటే దానిని నాశనం చేయడమే. వారు ఆ ధనాన్ని జాగ్రత్తగా వినియోగించుకోలేరు, పైగా దాని వల్ల కొత్త సమస్యలను సృష్టించే అవకాశం ఉంది. అలాంటి వారు తమ తప్పుల వల్ల మిమ్మల్ని కూడా ఇబ్బందుల్లోకి నెట్టవచ్చు. వారి అనాలోచిత నిర్ణయాలు, అసమర్థత మీ ఆర్థిక పరిస్థితిని కూడా ప్రభావితం చేయగలవు.

**మద్యం, వ్యసనాలు ఉన్నవారికి ధనం హానికరం:**

మద్యం లేదా ఇతర వ్యసనాలకు బానిసలైన వారికి డబ్బు ఇవ్వడాన్ని చాణక్యుడు తీవ్రంగా తప్పుపడతాడు. వారు ఆ డబ్బును మంచి పనులకు కాకుండా తమ వ్యసనాలకే ఖర్చు చేస్తారు. చివరికి వారి ఆరోగ్యం, జీవితమే నాశనమవుతాయి. అందులో మీ సహాయం కూడా భాగం కావడంతో, మీరు కూడా పరోక్షంగా ఆ పాపంలో భాగస్వాములవుతారు. మీరు చేసిన సహాయం వారిని మరింతగా వ్యసనాలకు బానిసలుగా మార్చవచ్చు.

**ఎప్పుడూ అసంతృప్తి, విచారంలో మునిగినవారికి సహాయం వృథా**

చాణక్యుని అభిప్రాయం ప్రకారం, ఎప్పుడూ అసంతృప్తిగా, విచారంగా ఉండే వ్యక్తుల మనసు ఎప్పటికీ తృప్తి చెందదు. వారికి ఎంత సహాయం చేసినా వారు సంతృప్తి చెందరు. పైగా, వారు మీ సహాయాన్ని విలువ చేయకపోవచ్చు. అటువంటి వ్యక్తులతో సంబంధాలు కూడా మీకు హానికరం కావచ్చు, ఎందుకంటే వారి ప్రతికూల దృక్పథం మిమ్మల్ని కూడా ప్రభావితం చేస్తుంది.

**బాధ్యతారాహిత్య వ్యక్తులకు సహాయం చేయకూడదు**

బాధ్యత లేని వ్యక్తి చేతిలో ధనం పెట్టడం అనేది మంటపైన నూనె పోసినట్లే. అలాంటి వ్యక్తి ధనాన్ని నిరర్థకంగా ఖర్చు చేసి, చివరికి మీరు ఇచ్చిన సహాయాన్ని దుర్వినియోగం చేయవచ్చు. వారికి తమ పనులపై బాధ్యత ఉండదు కాబట్టి, వారు మీ సహాయాన్ని ఉపయోగించుకుని ఎదగడానికి ప్రయత్నించరు, బదులుగా దానిని తేలికగా తీసుకుంటారు.

**ధనం ఇవ్వడంలో వివేకం అవసరం**

ధనం అనేది సమాజంలో మంచి పని చేయడానికి ఒక శక్తివంతమైన సాధనం. కానీ అది ఎవరికి ఇవ్వాలో ఎప్పుడు ఇవ్వాలో బాగా ఆలోచించాలి. అవసరమైన వారికి, నిజంగా ఎదగాలనే ఆకాంక్ష ఉన్నవారికి సహాయం చేస్తే అది ఫలిస్తుంది. అలాంటి సహాయం వారి జీవితాలను మార్చడమే కాకుండా, సమాజానికి కూడా మేలు చేస్తుంది. చెడు స్వభావం, మూర?త్వం, వ్యసనాలు ఉన్నవారికి ఇచ్చిన డబ్బు వ్యర్థమవుతుంది. చాణక్యుడు చెప్పిన ఈ నీతి ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవలసినది. "ధనం దానం చేయాలి కానీ అర్హత ఉన్నవారికే చేయాలి. లేకపోతే అది మనకే శాపంగా మారుతుంది. ఈ సూత్రాలను పాటించడం ద్వారా మనం మన ధనాన్ని సంరక్షించుకోవడమే కాకుండా.. అనవసరమైన సమస్యల నుండి కూడా తప్పించుకోవచ్చు.

# ఇంకా ఐసీయూలోనే పాక్ ఎయిర్ బేస్ లు... లేటెస్ట్ నోటమ్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలోని బైసరన్ లోయలో ఆహ్లాదంగా గడుపుతున్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసి నరమేథం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీంతో.. తొలుత ఉగ్రమూకలకు, తదుపరి పాక్ కు ముచ్చెమటలు పట్టించింది. అయితే.. నాడు భారత్ కొట్టిన దెబ్బకు పాక్ ఇంకా రిపేర్లు చేసుకుంటూనే ఉందనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది.అవును... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాదులపై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 9 ఉగ్ర శిబిరాలతోపాటు సుమారు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ సమయంలో తగుదునమ్మా అంటూ పాక్ సైన్యం రంగంలోకి దిగింది.. దీంతో భారత సైన్యం క్షిపణులతో విరుచుకుపడింది. పాక్ లోని కీలక ఎయిర్ బేస్ లను ధ్వంసం చేసింది. ఈ విధంగా నాడు భారత్ కొట్టిన దెబ్బ నుంచి పాకిస్థాన్ ఇంకా కోలుకోలేదని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ జరిగి సుమారు రెండు నెలలు దాటినా.. రహీమ్ యార్ ఖాన్ ఎయిర్ బేస్ వద్ద ఉన్న ఒకే ఒక్క రన్ వే ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో... ఆ విమానాశ్రయ మూసివేతను మూడోసారి పొడిగించింది పాకిస్థాన్. ఈ మేరకు తాజాగా నోటమ్ విడుదల చేసింది.ఇందులో భాగంగా.. ఆగస్టు 5 వరకు రహీమ్ యార్ ఖాన్ ఎయిర్ బేస్ వద్ద ఉన్న రన్ వే మూసివేసి ఉంటుందని తెలిపింది. అయితే ఆ మూసివేతకు గల కారణాలు మాత్రం వెల్లడించలేదు. వాస్తవానికి మే 10న భారత్ దాడి చేసిన నేపథ్యంలో తొలి నోటమ్ జారీ అయింది. దాంతో పంజాబ్ ప్రావిన్స్ లో ఉన్న ఈ ఎయిర్ బేస్ ఒక వారం రోజుల పాటు అందుబాటులో ఉండదని మాత్రం చెప్పింది.ఆ తర్వాత జూన్ 4న రెండో నోటమ్ జారీ చేసింది. అందులో... ఎయిర్ బేస్ మూసివేతను జులై 4 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో తాజా నోటమ్ లో దాన్ని.. ఆగస్టు 5 వరకూ మూసివేస్తున్నట్లు వెల్లడించింది. ఇలా వరుస పొడిగింపుల వేళ.. భారత్ ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్ ఇంకా కోలుకున్నట్లు లేదనే చర్చ బలంగా జరుగుతోంది.
కాగా... ఈ ఎయిర్ బేస్ గురించి భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత్ దెబ్బకు పాకిస్థాన్ లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్ బేస్ ఐసీయూలో ఉందని రాజస్థాన్ లోని ఓ సభలో ఆయన ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో తాజాగా.. ఆ ఎయిర్ బేస్ ఇంకా ఐసీయూలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

# కేటీఆర్ కోసం కేసీఆర్ మౌనవ్యూహం! కవిత సంగతి ఏంటో?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పార్టీపై పట్టు కోసం అధినేత కేసీఆర్ కుమారుడు, కుమార్తె మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. అయితే ఈ విషయంపై అధినేత కేసీఆర్ వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ, పరిస్థితులను గమనిస్తే కుమారుడు కేటీఆర్ కి పగ్గాలు అప్పగించడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని అంటున్నారు. తాజా రాజకీయాలు ఇవే సంకేతాలిస్తున్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్ అన్నట్లుగా రాజకీయం మారుతోందని అంటున్నారు. కేసీఆర్ కూడా సరిగ్గా ఇదే ఆశిస్తున్నారని చెబుతున్నారు. పార్టీపై కేటీఆర్ పూర్తి పట్టు సాధించేలా కేసీఆర్ దారులు చూపుతున్నారని అంటున్నారు. అందుకే రాజకీయంగా కీలక అంశాలపై కూడా ఆయన మాట్లాడటం లేదంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ రాజకీయంగా చాలా ప్రాధాన్యతాంశంగా తీసుకున్న 'బనకచర్ల'పై కూడా అధినేత మాట్లాడకపోవడాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు.సహజంగా ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు, ప్రజల్లో తెలంగాణ భావోద్వేగాన్ని తట్టి లేపెందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ఆంధ్రాతో ముడిపడిన అంశాన్ని ఎత్తుకుంటుంది. అలాంటి అంశాన్ని హైలెట్ చేయడానికి కేసీఆర్ మీడియా ముందుకు వస్తారు. ఆయన చెబితేనే తెలంగాణ సమాజంలోకి విషయం చొచ్చుకువెళుతుందన్న విశ్లేషణలు ఉన్నాయి. కానీ, బనకచర్ల విషయంలో ఎక్కడా కేసీఆర్ మాట్లాడలేదు. కేటీఆర్ ను ముందు పెట్టి 'బనకచర్ల' డ్రామాను రక్తి కట్టించారు.ప్రభుత్వం కూడా 'బనకచర్ల'పై బీఆర్ఎస్ దాడితో ఆత్మరక్షణలో పడినట్లు కనిపించిందని అంటున్నారు. ఇదంతా కేసీఆర్ వ్యూహంగా చెబుతున్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీకి భావినేతగా కేటీఆర్ ను హైలెట్ చేయడానికే ఆయన వెనక్కి తగ్గారంటున్నారు. నిజానికి ఎన్నికల్లో పార్టీ ఓడిన నుంచి కేసీఆర్ ఎక్కువగా మౌనాన్ని పాటిస్తున్నారు. ఉద్యమ సమయంలో మాట్లాడినట్లు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి అయ్యాక అడపాదడపా మీడియాతో మాట్లాడిన కేసీఆర్, ఇప్పుడు ఎక్కువగా తన కుమారుడు కేటీఆర్ తోనే మాట్లాడిస్తున్నారు.2023లో ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోయిన తర్వాత ఎర్రవల్లి ఫాం హౌజుకు వెళ్లిన కేసీఆర్.. ఒకటి రెండు సార్లు మాత్రమే రాజకీయ కార్యకలాపాలను నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహణకు బీఆర్ఎస్ భవన్ కు రెండుసార్లు వచ్చిన కేసీఆర్, ఏప్రిల్ లో బీఆర్ఎస్ 25 ఏళ్ల సంబురాలకు మరోసారి వరంగల్ వచ్చారు. అంతేగాని రాజకీయంగా ఆయన ఎక్కడా కనిపించడం లేదు. చివరికి అసెంబ్లీకి కూడా మార్చిలో ఒక రోజు వచ్చి వెళ్లిపోయారు. కానీ, ప్రతి రోజు కేటీఆర్ ద్వారానే బీఆర్ఎస్ ప్రకటనలు ఇప్పిస్తున్నారు. పార్టీకి సర్వం కేటీఆర్ అన్న భావన వ్యాప్తి కలిగేలా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. ఇది గమనించే పార్టీలో తన పాత్రపై క్లారిటీ కోసం కవిత ఆరాటపడుతున్నారని అంటున్నారు. అయితే పార్టీకి ఎవరో ఒకరే సుప్రీం కమాండర్గా ఉంటారని అంటున్నారు. కేసీఆర్ కూడా కేటీఆర్కు లైన్ క్లియర్ చేసేందుకు తనతోపాటు మిగిలిన వారిని సైతం వెనక్కి తగ్గిస్తున్నారని చెబుతున్నారు.

# భార్యలు చనిపోయిన భర్తలకు పెన్షన్... కార్యకర్త కోరికకు ఎమ్మెల్యే షాకింగ్ రిప్లై!

**హైదరాబాద్ పెన్ పవర్:** నాయకుల వల్ల ప్రజలు చెడిపోతున్నారా.. ప్రజల వల్ల నాయకులు చెడిపోతున్నారా అని అంటే... కోడి ముందా, గుడ్డు ముందా అనే ప్రశ్న గుర్తుకు వస్తుందని అంటారు. ఈ క్రమంలో.. ఎన్నికల్లో నాయకులు ఇచ్చే హామీలకు పోటీగా అధికారంలో ఉన్న నేతలకు తగ్గట్లుగా ప్రజల కోరికలూ ఉంటున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ కార్యకర్త ఎమ్మెల్యేని కోరిన కోరిక వైరల్ గా మారింది.అవును... వాస్తవానికి ఎమ్మెల్యే ఎదురైతే చాలా మంది రేషన్ కార్డుల గురించో, విద్యుత్, నీటి సమస్యల గురించో ప్రస్థావిస్తుంటారు.. రోడ్ల సమస్యలను ప్రధానంగా ప్రస్థావిస్తుంటారు. అయితే ఓ టీడీపీ కార్యకర్త రొటీన్ కి భిన్నంగా కోరారు. ఇందులో భాగంగా.. భర్త చనిపోయిన భార్యలకు పెన్షన్ ఇస్తున్నట్లే... భార్య చనిపోయిన భర్తలకు కూడా పెన్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యేని కోరాడు. అదొకెత్తైతె.. ఎమ్మెల్యే ఇచ్చిన రిప్లై మరొకెత్తన్నట్లుగా మారింది.
వివరాల్లోకి వెళ్తే... అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం తక్కలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో.. ఓ టీడీపీ కార్యకర్త స్పందిస్తూ... భర్త చనిపోయిన భార్యలకు పెన్షన్ ఇస్తున్నట్లే.. భార్య చనిపోయిన భర్తలకు పెన్షన్ ఇప్పించాలని విన్నవించాడు. దీంతో.. కొంతమంది నవ్వగా, మరికొంతమంది ఆశ్చర్యపోయారు!



ఈ ప్రశ్నకు ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందిస్తూ... ఆ కార్యకర్త కోరికను ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భార్య చనిపోయిన భర్తలకు పెన్షన్ ఇవ్వాలన్న అంశంపై ముఖ్యమంత్రిని కోరతానని చెప్పారు. దీంతో.. అది నిజమో, వ్యంగ్యమో తెలియకో ఏమో కానీ... అక్కడున్న అందరూ కడుపుబ్బా నవ్వుకున్నారు! ఈ విషయం నెట్టింట చర్చనీయాంశంగా మారింది.
ఈ సందర్భంగా... రోజు రోజుకీ సామాజిక పెన్షన్లు, సంక్షేమ కార్యక్రమాలకు అర్థం మారిపోతుందనే చర్చ నెట్టింట మొదలైంది.

# మనిషా..పశువా..? 'ఈటెల' మాటల దాడి.. పార్టీలోని ఆ ప్రత్యర్థి మీదేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ బీజేపీలో మళ్లీ రగడ... ఉమ్మడి కరీంనగర్ రాజకీయాలు వీధికెక్కుతున్నాయి.. హుజూరాబాద్ నియోజకవర్గం గురించి శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గానా? అన్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం స్పందించారు. అసలు ఇంతకూ ఏం జరుగుతున్నదంటే? ఈటల రాజేందర్ బీఆర్ఎస్ తరఫున ఉమ్మడి కరీంనగర్ లోని హుజూరాబాద్ నియోజకవర్గానికి 2024 నుంచి 2023 వరకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2021లో బీజేపీలోకి వచ్చారు. ఉప ఎన్నికల్లో గెలుపొందినా, 2023లో ఓడిపోయారు. 2024 ఎంపీ ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి గెలిచారు. కాగా, లోక్ సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచారు. అయితే, కరీంనగర్ ఎంపీగా పోటీచేసిన బండి సంజయ్ కు ఆ లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని హుజూరాబాద్ లో మెజారిటీ రాకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. హుజూరాబాద్ లో తనకు వ్యతిరేకంగా కొందరు పనిచేశారని ఆయన వ్యాఖ్యానించడం దుమారం రేపాయి. దీనికితోడు ఈటల, సంజయ్ ఇద్దరూ బీజేపీ రాష్ట్ర చీఫ్ పదవికి పోటీ పడడం విభేదాలు మరింత ముదిరాయి.
శుక్రవారం ఈటలను శామీర్ పేట (ఆయన నివాసం ఉండే ప్రాంతం) కుట్రదారుగా పేర్కొంటూ ప్రత్యర్థి వర్గం విమర్శలు



చేసింది. సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేశారు. ఆయన ప్రధాన అనుచరుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి బీజేపీకి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఈటల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. శామీర్ పేటలోని తన ఇంట్లో నిర్వహించిన ఈ సమావేశానికి హుజూరాబాద్ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. బీజేపీలో స్థానిక నేతలు ఇబ్బంది పెడుతున్నారని, పదవులు ఇవ్వడం లేదని ఈటల పరిశీలనకు తీసుకెళ్లారు.
కార్యకర్తలను ఉద్దేశించి ఈటల మాట్లాడుతూ.. పరోక్ష్యంగా ప్రత్యర్థిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వీరులతో, ధీరులతో కొట్లాడతాం అని, కుట్రదారులు, ద్రోహులతో కాదని పేర్కొన్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకోం అని అన్నారు. 'కొడకా ఖబడ్దార్..!.. హుజూరాబాద్ గడ్డ మీద, ప్రతి ఊర్లో మనమే ఉంటాం. వార్డు సభ్యులుగా సర్పంచులుగా అన్నిచోట్లా మనమే" అని అన్నారు. తనపై కుట్రదారు విమర్శలను ఉద్దేశిస్తూ.. "వాడు సైకోనా శాడిస్టా మనిషా పశువా..."? అంటూ నిప్పులు చెరిగారు. "నువ్వు ఏ పార్టీలో ఉన్నవో.. వెనుకెవదున్నది ఎవడో..!" అని వ్యాఖ్యానించారు. ఈటల వ్యాఖ్యల్లో నేరుగా ఎవరినీ ప్రస్తావించకున్నా.. ఎవరిని ఉద్దేశించినవో తెలుస్తోందని అంటున్నారు.

# దావూద్ తో కలిపి ఏడుగురు.. పాక్ రక్షణలోని భారత్ మోస్ట్ వాంటెడ్స్ వీరే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో ఉగ్వాదాన్ని ప్రోత్సహిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తూ, వారిని తమ అనధికారిక సైన్యంగా చూసే దేశం పాకిస్థాన్ అనే సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలోనే అటు ప్రపంచానికి, ఇటు భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులైన ఏడుగురు ఉగ్రవాదులు ఆ దేశంలోనే తలదాచుకుంటున్నారు. వారిని పాక్ కంటికి రెప్పలా కాపాడుతోందని చెబుతారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..!
అవును... భారత్ తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు ఘోరాలకు పాల్పడి, వందల మంది అమాయక ప్రజల ప్రాణాలు తీసిన వారు.. ఎక్కడో అడవుల్లోనో, ప్రపంచానికి కనిపించని శిథిలాల్లోనో, గుహల్లోనో తలదాచుకుంటారని అనుకుంటే పొరపాటే. వారిని సొంత పౌరులుగా ఆశ్రయం కల్పిస్తూ, రక్షణ కల్పిస్తూ రక్షిస్తుంది పాకిస్థాన్. పైకి మాత్రం... తాము కూడా ఉగ్రవాద బాధితులమే అని చెప్పుకుంటుంది.

**హఫీజ్ సయీద్:**
యునైటెడ్ స్టేట్స్ నావల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ కార్యాలయం ప్రకారం.. హఫీజ్ సయీద్ 1990ల ప్రారంభంలో పాకిస్తాన్ కు చెందిన ఇస్లామిక్ ఛాందసవాద మిషనరీ గ్రూపు అయిన మర్కజ్ ఉద్ దవా-వాల్ ఇర్షాద్ సైనిక విభాగంగా స్థాపించిన లష్కర్ తోయిబా ఉగ్రవాద సంస్థకు అధిపతి. ఈ ఉగ్రసంస్థ భారతదేశంపై జరిపిన దాడులు ఎన్నో ఉన్నాయి!
ఇందులో ప్రధానంగా 2006లో ముంబైలో జరిపిన 26/11 ఘోరం ఒకటి. ఈ ఘటనలో సుమారు 360 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు! అంతకంటే ముందు.. 2000 సంవత్సరంలో ఢిల్లీలోని ఎర్రకోటపై లష్కర్ ఉగ్రవాదులు దాడి చేశారు. దీంతో.. ఈ దాడుల వెనకున్న హఫీజ్ ను అమెరికా, ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదిగా ప్రకటించాయి.
ఈ నేపథ్యంలో అతని తలపై %వి%10 మిలియన్ల రివార్డు ఉంది. అయినప్పటికీ ఆ ఉగ్రవాది ఎక్కడో చీకట్లో, ప్రపంచానికి తెలియని ప్రదేశంలో దాక్కొన్నాడంటే పొరపాటే! అతడు సాయుధ రక్షణలో లాహోర్ లో హాయిగా నివసిస్తున్నాడు. ఇలాంటి బ్యాచ్ ఇంకా పాక్ లో చాలా మందే ఉన్నారు.

**మసూద్ అజార్:**
హఫీజ్ అనంతరం పాకిస్తాన్ లో స్థిరపడి, ఆదేశ సైన్యం రక్షణలో ఉన్న జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత మసూద్ అజార్ ఉన్నాడు. పుల్వామా, ఉరి ఉగ్రవాద దాడులకు సూత్రధారి అయిన అజార్ ను 2019లో ఐక్యరాజ్యసమితి 'గ్లోబల్ టెర్రరిస్ట్'గా ప్రకటించింది. ఆ దాడుల్లో సుమారు 59 మంది సైనికులు మరణించగా.. పదుల సంఖ్యలో తీవ్రంగా



గాయపడ్డారు.ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ లో అతడు పాకిస్తాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ లో జరిగిన ఒక ఇస్లామిక్ సెమినరీలో ప్రసంగించాడు. ఈ సందర్భంగా... భారతదేశంపై మరిన్ని ఉగ్రవాద దాడులు చేస్తామని ప్రతిజ్ఞ చేశాడు. ఈ నేపథ్యంలో... అతన్ని వెంటనే అరెస్టు చేయాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేసింది. కానీ.. అతడి ఆచూకీ గురించిన సమాచారం తమ వద్ద లేదని పాక్ బొంకింది!

**జకీర్ రెహ్మాన్ లఖ్వీ:**
వీరిద్దరి తర్వాత స్థానంలో జకీర్ రెహ్మాన్ లఖ్వీ ఉన్నాడు. అతడు ఒక ఇస్లామిక్ బోధకుడే కాకుండా లష్కరే తోయిబా లో సీనియర్ వ్యక్తి కూడా! 26/11 ముంబై దాడి వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి ఇతడే అనే నివేదికలు ఉన్నాయి. ఇతడిని పాక్ గతంలో జైలులో పెట్టింది. అనంతరం అతి తక్కువ కాలంలోనే బెయిల్ పై విడుదలయ్యాడు.
ఇతడు 2020 నుండి ఇతర ఉగ్రవాదుల మాదిరిగానే పాక్ లో స్వేచ్ఛగా ఉన్నాడని చెబుతారు. ఈ క్రమంలో... పంజాబ్ ప్రావిన్స్, ఇస్లామాబాద్ లలో ఇతడి అడ్రస్ లు కూడా రికార్డులో ఉన్నాయని అంటారు. అతనికి పాక్ సైన్యంతో పాటు చైనా కూడా రక్షణ కల్పిస్తున్నాయని అంటారు. అతన్ని కీలక ఉగ్రవాదుల జాబితాలో చేర్చాలనే ఐరాస ప్రయత్నాన్ని బీజింగ్ అడ్డుకుంది!

**సయ్యద్ సలావుద్దీన్:**
ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు సయ్యద్ సలావుద్దీన్. ఇతడు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థకు అధిపతి. కాగా.. కాశ్మీర్ లోయను భారత దళాలకు శ్మశానవాటికగా మారుస్తానని ఇతడు ప్రతిజ్ఞ చేశాడు. ఇతడు ఇప్పటికీ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో భారతదేశ వ్యతిరేక ర్యాలీలకు నాయకత్వం వహిస్తున్నట్లు చెబుతారు.

**దావూద్ ఇబ్రహీం:**
ఆ తర్వాత స్థానంలో దావూద్ ఇబ్రహీం ఉన్నాడు. అపఖ్యాతి పాలైన డి-కంపెనీ క్రైమ్ సిండికేట్ అధిపతి, హత్య, కిరాయికి హత్య, దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటి ఆరోపణలపై వాంటెడ్ గా ఉన్న దావూద్ ఇబ్రహీం... ఇప్పటికే కరాచీలో ఫ్యామిలీతోపాటు క్షేమంగా ఉన్నట్లు చెబుతారు. పాక్ మాత్రం తమకు తెలియదు అని అంటుంటుంది!
దశాబ్దం క్రితం ముంబైలో జరిగిన బాంబు దాడుల్లో అతని పాత్రకు గాను 2003లో భారతదేశం, అమెరికా అతన్ని 'గ్లోబల్ టెర్రరిస్ట్'గా ప్రకటించాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్.బీ.ఐ) 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో కూడా ఉన్నాడు. అతని తలపై %వి%25 మిలియన్ల రివార్డ్ ఉంది.

**భత్కల్ బ్యాచ్:**
ఈ ఐదుగురితోపాటు భారతదేశంలో స్లీపర్ సెల్స్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పే ఇండియన్ ముజాహిదీన్ ను స్థాపించిన బాంబర్ ఇక్బాల్ భత్కల్.. ఆ గ్రూపును సహ వ్యవస్థాపకుడు, దానికి ఫైనాన్షియర్ గా వ్యవహరిస్తున్న అతని సోదరుడు రియాజ్ భత్కల్ ఇద్దరూ కూడా కరాచీలోనే నివసిస్తున్నారు. భారత్ పై దాడి చేయడానికి వీరంతా పాక్ ను లాంచ్ ప్యాడ్ గా ఉపయోగిస్తున్నారు.
కాగా.. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహించిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్)ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ.. ఇది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ముసుగు సంస్థ అని అమెరికా పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన పాక్.. పహల్గాం దాడికి, లష్కరే తయిబా కు ఎలాంటి సంబంధం లేదని.. సదరు ఉగ్రసంస్థ నెట్ వర్క్ ను తాము ఇప్పటికే ధ్వంసం చేసినట్లు పేర్కొంది.
ఈ నేపథ్యంలో... పాకిస్థాన్ రక్షణలో ఉన్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితా మరోసారి చర్చకు వచ్చింది. ఇంతమందికి రక్షణ కల్పిస్తున్న పాకిస్థాన్.. టీఆర్ఎఫ్ విషయంలో అమెరికా ప్రకటనపై తీవ్రంగా స్పందించడంలో పెద్ద విచిత్రం లేదని అంటున్నారు. ఇదే సమయంలో ఆ ఏడుగురు మోస్ట్ వాంటెడ్స్ పైనా పాక్ ఓ ప్రకటన చేస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

## ఆ ఒక్కడు ఉండుంటే.. లార్డ్స్ టెస్ట్ ఇండియా ఈజీగా గెలిచేది: ఇంగ్లాండ్ మాజీ బౌలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్: ఐదు మ్యాచుల సిరీస్?లో భాగంగా ప్రతిష్టాత్మక లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమి పాలైన సంగతి తెలిసిందే. మ్యాచ్ మొత్తం ఆధిపత్యం చెలాయించిన టీమిండియా 22 పరుగుల స్వల్ప తేడాతో మ్యాచును కోల్పోయింది. ఈ క్రమంలో లార్డ్స్ టెస్టులో టీమిండియా ఓటమిపై ఇంగ్లాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టీవ్ హార్మిసన్ హాట్ కామెంట్స్ చేశాడు. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఆడి ఉంటే.. భారత్ సులభంగా మ్యాచ్ గెలిచేదన్నాడు.
సిరీస్‌లో ఇప్పటి వరకు జరిగిన మ్యాడు టెస్టుల్లో టీమిండియానే ఆధిపత్యం చెలాయించినప్పటికీ.. ఇంగ్లాండ్ రెండు మ్యాచుల్లో విజయం సాధించిందని.. ఈ లోపంపై భారత్ దృష్టి పెట్టాలని సూచించాడు. సిరీస్?లో టీమిండియానే ఎక్కువ సెంచరీలు, వికెట్లు తీసింది. కానీ చివరకు మ్యాచ్ ఎలా గెలవాలనే వ్యూహం ఇంగ్లాండ్?కు బాగా తెలుసన్నారు. ఇంగ్లాండ్ మాదిరిగా ఒక సెషన్?లో ఆట గమనాన్ని మార్చే దారి భారత్ వెతకాలన్నారు. టీమిండియా తనను తాను నమ్మడం ప్రారంభించాలని సూచించాడు. నాల్గో ఇన్నింగ్స్ ఛేజింగ్?లో విరాట్ కోహ్లీ లాంటి వారు సులభంగా టార్గెట్ పూర్తి చేస్తారని.. లార్డ్స్ టెస్టుల్లో కోహ్లీ ఆడి ఉంటే భారత్ సునాయసంగా విజయం సాధించేదన్నాడు స్టీవ్ హార్మిసన్.
ఇక ఐదు మ్యాచుల సిరీస్?లో భారత్ 1-2 తేడాతో వెనుకబడి ఉంది. తొలి టెస్టులో అతిథ్య ఇంగ్లాండ్ గెలవగా.. రెండో టెస్టులో టీమిండియా విజయం సాధించి తొలి ఓటమికి రివేంజ్ తీర్చుకుంది. లార్డ్స్?లో జరిగిన మూడో టెస్టులో విజయంతో కంబ్యాక్ ఇచ్చిన ఇంగ్లాండ్ 1-2 తేడాతో సిరీస్?లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 2025, జూలై 23న మాంచెస్టర్‌లోని ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో నాల్గో టెస్ట్ జరగనుంది. ఈ మ్యాచులో ఎలాగైనా గెలిచి సిరీస్ సమం చేయాలని భారత్.. మాంచెస్టర్?లో విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని ఇంగ్లాండ్ ఉవ్విళ్లురుతున్నాయి.

# బుమ్రా ఏం తోపు కాదు.. అతనొక్కడే జట్టును గెలిపించలేడు: గ్రెగ్ చాపెల్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతోన్న ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్?లో ప్రతి మ్యాచుకు ముందు టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మ్యాచ్ ఆడతాడా లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంటుంది. వర్క్ లోడ్ కారణంగా సిరీస్?లోని ఏవైనా మూడు మ్యాచులు మాత్రమే బుమ్రా ఆడతాడని సిరీస్?కు ముందే బీసీసీఐ చెప్పడమే ఇందుకు కారణం. టీమిండియా అతిగా బుమ్రా మీద ఆధార పడటంతో కొందరు విమర్శలు చేస్తున్నారు. సరిగ్గా ఇదే అంశాన్ని టార్గెట్ చేశారు ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ ప్లేయర్ గ్రెగ్ చాపెల్. ఓ స్పోర్ట్స్ ఛానెల్?తో చాపెల్ మాట్లాడుతూ.. టీమిండియా బుమ్రాపై అతిగా ఆధారపడటాన్ని తప్పుబట్టారు. ఇకనైనా టీమిండియా బుమ్రాపై అతిగా ఆధార పడటం మానేయాలని చురకలంటించారు. క్రికెట్ అనేది ఒక టీమ్ గేమ్ అని.. ఒక్కడి వల్లే ఎప్పుడు జట్టు గెలవదని.. టీమ్?లోని సభ్యులంతా సమిష్టిగా రాణించినప్పుడే విజయం దక్కుతుందన్నారు చాపెల్. బుమ్రా లేకుండానే ఇటీవల భారత్ చాలా టెస్టులు గెలిచిందని గుర్తు చేశారు. ఆటలో ఎప్పుడైనా వ్యక్తిగత ప్రతిభ ముఖ్యం కాదని.. సమిష్టి ప్రదర్శన ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పని తాము చేసినప్పుడే జట్లు గెలుస్తాయన్నారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతోన్న ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్?లో లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్, లార్డ్స్?లో జరిగిన మూడో టెస్టులో బుమ్రా ఆడాడు. అనూహ్యంగా ఈ రెండు టెస్టుల్లో భారత్ ఓటమి పాలైంది. బుమ్రా ఆడని రెండో టెస్టులో మాత్రం టీమిండియా విజయం సాధించింది. ఈ పాయింట్?నే టార్గెట్ చేస్తూ చాపెల్? పై విధంగా కామెంట్స్ చేశారు. ఓవరాల్?గా కూడా బుమ్రా ఆడని టెస్టులలో భారత్ 70 శాతం గెలవగా.. అతడు జట్టులో ఉన్న మ్యాచుల్లో 40 శాతం మాత్రమే విజయం సాధించిందని రికార్డులు చెబుతున్నాయి.



ఇక, ఐదు మ్యాచుల సిరీస్?లో భారత్ 1-2 తేడాతో వెనుకబడి ఉంది. తొలి టెస్టులో అతిథ్య ఇంగ్లాండ్ గెలవగా.. రెండో టెస్టులో టీమిండియా విజయం సాధించి తొలి ఓటమికి రివేంజ్ తీర్చుకుంది. లార్డ్స్?లో జరిగిన మూడో టెస్టులో విజయంతో కంబ్యాక్ ఇచ్చిన ఇంగ్లాండ్ 1-2 తేడాతో సిరీస్?లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 2025, జూలై 23న మాంచెస్టర్‌లోని ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో నాల్గో టెస్ట్ జరగనుంది. ఈ మ్యాచులో ఎలాగైనా గెలిచి సిరీస్ సమం చేయాలని భారత్.. మాంచెస్టర్?లో విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని ఇంగ్లాండ్ జట్లు ఉవ్విళ్లురుతున్నాయి.

# కెప్టెన్‌గా గిల్ ఫెయిల్ అవడం వల్లే... లార్డ్స్ టెస్ట్ ఓటమి.. మాంచెస్టర్ టెస్ట్ గిల్ కి అసలు పరీక్ష.. : చాపెల్ కామెంట్స్..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీంఇండియా కెప్టెన్ శుబ్మన్ గిల్ ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు ఆస్ట్రేలియా మాజీ బ్యాట్స్ మెన్ గ్రెగ్ చాపెల్. లార్డ్స్ టెస్ట్ ల టీంఇండియా ఓటమికి గిల్ పేలవమైన కెప్టెన్సీ కారణమని అన్నారు. జడేజా లాంటి బ్యాట్స్ మెన్ ని టెయిల్ఎండ్ లో పంపుతున్నప్పుడు మ్యాచ్ గెలవడమే లక్ష్యంగా ఆడాలని గిల్ నేరుగా చెప్పుండాల్సిందని అన్నారు చాపెల్. లార్డ్స్ టెస్ట్ లాంటి సందర్భంలో జడేజా లాంటి బ్యాట్స్ మెన్ ఒక్కడే మిగిలి ఉన్నప్పుడు సింగిల్స్ కి వెళ్లడం సరైన ఛాయస్ కాదని.. వీలైనన్ని బాల్స్ ని బౌండరీకి చేర్చి టీం గెలిపించేలా ఆడాలని అన్నారు చాపెల్. ఇక జులై 23న మాంచెస్టర్ లో ప్రారంభమయ్యే నాలుగో టెస్ట్ గిల్ కి అసలైన పరీక్ష అని అన్నారు చాపెల్. ఐదు మ్యాచ్ ల సిరీస్ ను హీడింగ్లో 5 వికెట్ల తేడా ఓటమితో ఆరంభించిన ఇండియా.. ఆ తర్వాత ఎడ్జ్ బాస్టన్ లో 336 పరుగుల ఘనవిజయంతో పుంజుకున్నప్పటికీ లార్డ్స్ టెస్ట్ ఓటమితో మళ్ళీ వెనకబడింది టీం ఇండియా. ఇక 23న జరిగే మాంచెస్టర్ టెస్ట్ లో ఇండియా ఓడినా లేక డ్రాతో సరిపెట్టుకున్నా... ఇంగ్లాండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచే ఛాన్స్ కోల్పోతుంది ఇండియా. మాంచెస్టర్ టెస్ట్ గిల్ కి బ్యాట్స్ మెన్ గానే కాకుండా కెప్టెన్ గా కూడా పెద్ద పరీక్ష అని చెప్పాలి. జాక్ క్రాలీపై శుభ్మన్ గిల్ స్లెడ్జింగ్ చేయడంపై కూడా కామెంట్స్ చేశారు చాపెల్, గిల్ మంచి కమ్యూనికేటర్ గా ఎదగటంపై దృష్టి పెట్టాలని... గ్రౌండ్ లోకి దిగిన ప్రతిసారి రన్స్ సాధించడం సాధ్యం కాదని అన్నారు చాపెల్.

# డ్రాగన్ బ్యూటీ.. అగ్గిరాజేసే అందం..!

ఒక్క సినిమా హిట్టు పడితే చాలు సినీ పరిశ్రమలో తమ ఫేట్ మారిపోతుంది. అప్పటిదాకా సినిమాలు చేసినా కూడా ఒక్క హిట్ సినిమా వల్ల డజన్ల కొద్దీ ఛాన్స్ లు వస్తుంటాయి. ప్రస్తుతం ఇలాంటి ఫేజ్ లోనే ఉంది డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే సినిమాలు చేస్తున్నా కూడా అమ్మడు అంతగా పాపులర్ అవ్వలేదు. తెలుగులో ఆల్రెడీ శ్రీవిష్ణుతో అల్లూరి సినిమా చేసింది కయదు లోహర్. ఆ టైంలో అమ్మడిని అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ ప్రదీప్ రంగనాథ్ డ్రాగన్ సినిమా రిలీజైన దగ్గర నుంచి కయదు కనిపిస్తే చాలు హడావిడి చేస్తున్నారు. కయదుకి వచ్చిన ఈ క్రేజ్ ఆమెకు వరుస అవకాశాలు వచ్చేలా చేస్తున్నాయి.



నేహా మాలిక్ మొనాకో మ్యాజిక్: ఓషన్ బ్లూస్

డ్రాగన్ సినిమాలో కయదు గ్లామర్ షో కుర్రాళ్లని ఎట్రాక్ట్ చేసింది. కయదు తెలుగులో కూడా మంచి క్రేజ్ సంపాదించింది. ప్రస్తుతం అమ్మడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో నటిస్తుంది. రవితేజ అనార్కలిలో కూడా ఉందని టాక్. ఐతే ఎలాగు సినిమా ఆఫర్లతో సూపర్ జోష్ లో ఉన్న కయదు అది చాలదు అన్నట్టుగా తన సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా అదరగొట్టేస్తుంది. అమ్మడి ఫోటో షూట్స్ ఇలా షేర్ చేస్తే అలా వైరల్ అవుతున్నాయి. లేటెస్ట్ గా కయదు లోహర్ చంకీల డ్రెస్ లో తళతళ మెరుస్తుం ది. ఈ ఫోటో షూట్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా యి. అగ్గి రాజేస్తున్న అందం.. గుండెల్ని గుచ్చేసే చూపులతో కయదు హృదయాలను మెలిపెట్టేస్తుందని చెప్పొచ్చు. డ్రాగన్ ఒక్క హిట్ తోనే అమ్మడు ఈ రేంజ్ పాపులారిటీ సంపాధించగా ఇక నెక్ట్స్ అమ్మడి ఖాతాలో మరో హిట్ పడితే మాత్రం ఇక తిరుగు లేని క్రేజ్ తెచ్చుకునేలా ఉంది.



తెలుగులో మాత్రం కయదుకి మంచి బజ్ ఏర్పడింది. విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో ఆమె స్పెషల్ ఎట్రాక్షన్ అవుతుందని చెప్పొచ్చు. అనుదీప్ డైరెక్షన్ లో వస్తున్న ఫంకీతో కయదు టాలీవుడ్ కి మరోసారి రీ ఎంట్రీ ఇస్తుంది. తనకు వచ్చిన ఈ క్రేజ్ ని ఎంజాయ్ చేస్తున్న కయదు రెగ్యులర్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేస్తుంది. కయదు గ్లామర్ షోకి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. చూస్తుంటే అమ్మడు సౌత్ లో టాప్ రేంజ్ కి వెళ్లేలా ఉందని చెప్పొచ్చు.

పాలక్ తివారీ బీచ్ డే లుక్‌ను అభిమానులు తగినంతగా పొందలేరు



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com